జిల్లాలోని ఇసుక క్వారీలన్నింటిని తనిఖీచేసి రిపోర్టు ఇవ్వాలని జాతీయ హరిత ట్రైబ్యునల్ జారీచేసిన ఆదేశాలు ఇక్కడి అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తేలా చేస్తున్నాయి. భారీ యంత్రాలతో జిల్లాలో కృష్ణానది తీరం వెంట నిత్యం ఇసుక తవ్వకాలు జరుపుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకుండా ప్రేక్షకపాత్రకు పరిమితం అవుతున్నారు. దీనిపై శాటిలైట్ ఇమేజ్‌లన్నీ కేంద్ర నిఘాసంస్థల వద్ద నిక్షిప్తమై ఉన్నట్లు ఇప్పటికే ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించినా ఉలుకుపలుకు లేదు. తాజాగా ఎన్‌జీటీ ఇసుక రీచ్‌లన్నింటిని తనిఖీ చేయాలని జిల్లా కలెక్టర్‌ని ఆదేశించడంతో అధికారులు హడలిపోతున్నారు. ఎన్‌జీటీ వద్ద సమగ్ర సమాచారం ఉన్న నేపథ్యంలో అక్రమాలను దాచిపెట్టి అంతా సవ్యంగా ఉన్నట్లు రిపోర్టు అస్తే అది సంబంధిత అధికారుల మెడకు చుట్టుకునే అవకాశం లేకపోలేదు.


అమరావతి: మల్లాదిలో ఎక్స్‌కవేటర్లతో ఇసుక లోడింగ్ చేస్తున్న దృశ్యం

ఇసుక మస్కా

- ఎన్జీటీ ఆదేశాలతో ఇసుక రీచ్‌లను పరిశీలించిన కలెక్టర్‌లు
- కృష్ణా తీరంలో గుంటూరు, బాపట్ల కలెక్టర్‌ల తనిఖీలు
- అమరావతి ప్రాంతంలో పల్నాడు కలెక్టర్.. ● మున్నంగి రీచ్‌కి వచ్చిన వారిని బయటకు పంపేసిన అధికారులు
- మీడియాను తిప్పిపంపిన అధికారులు ● కొన్నిచోట్ల కలెక్టర్‌లను తప్పుదారి పట్టించిన కిందిస్థాయి సిబ్బంది
- తవ్వకాలు జరిపేది ఒకచోటయితే చూపించింది మరోచోట
- అక్రమార్కులకు ముందే సమాచారం ఎవరిచ్చినట్టో!
- తవ్వకాలు ఆపేసి... యంత్రాలను తప్పించేసి...
- ఇన్నాళ్లు కళ్లకు గంతలు కట్టుకొన్న జిల్లా స్థాయి అధికారులు

గుంటూరు, తెనాలి, ఫిబ్రవరి14 (ఆంధ్ర జ్యోతి): ఎన్జీటీ ఆదేశాలతో గుంటూరు, బాపట్ల జిల్లాల్లో రెండు జిల్లాల కలెక్టర్‌లు, ఇతర శాఖల అధికారుల బృందం కృష్ణా తీరంలోని ఇసుక రీచ్‌లలో తనిఖీలు నిర్వహించింది. బాపట్ల జిల్లా జువ్వలపాలెం, గుంటూరు జిల్లా మున్నంగి, మరికొన్ని రీచ్‌లలో కలెక్టర్ల బృందం ఇసుక తవ్వకాల తీరును పరిశీలించింది. అయితే తనిఖీల సమయంలో స్థానికును అనుమతించలేదు. బాపట్ల జిల్లా కలెక్టర్ జువ్వలపాలెం రీచ్ పరిశీలించే సమయంలో స్థానికులు ఎవరైనా ఉన్నారా అని ఆరా తీశారు. స్థానికులను అక్కడికి రానివ్వకుండా కిందిస్థాయి అధికారులు ముందస్తుగానే జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే గుంటూరు జిల్లా అధికారుల బృందం మాత్రం మున్నంగిలో పరిశీలించే సమయంలో అధికారులు మినహా ఇతరులు ఎవరూ ఉండొద్దని ముందే చెప్పేయటంతో స్థానికులు దగ్గరకు వెళ్లలేదు. చివరకు మీడియాను కూడా తర్వాత పిలుస్తామని సున్నితంగా వెనక్కు పంపేశారు. అయితే కొన్నిచోట్ల స్థానికులు దూరం నుంచి తవ్వకాలు జరుగుతోంది ఇక్కడ కాదు... మరోచోటని అధికారుల బృందానికి చెప్పేందుకు ప్రయత్నించినా వారి కేకలు పట్టించుకోలేదు. తవ్వకాలు జరుగుతున్నది ఒకచోటైతే, తనిఖీలు చేసింది మాత్రం మరోచోట. ఎన్‌జీటీ ఆదేశాల మేరకు అన్ని రీచ్‌లను క్షుణ్ణంగా పరిశీలించాల్సిఉంటే, కిందిస్థాయి సిబ్బంది, మైనింగ్ శాఖలో కొందరు ఏకంగా జిల్లా కలెక్టర్‌లనే తప్పుదారి పట్టించారు. రెండు రోజుల ముందు ఆపేసిన రీచ్‌ను ఒకచోట, జె.పి సంస్థ తవ్వకాలు ఆపేసిన తర్వాత ఆగిన మరోచోట చూపించటం, కింద నీరు ఉండటంతో ఒడ్డునుంచే పరిశీలించాల్సి వచ్చింది. పల్నాడు జిల్లాలో కలెక్టర్ తనిఖీలకు వచ్చినపుడు కొంతవరకు తవ్వకం దారులు, అధికారులు భయపడినట్టు కనిపిస్తే, గుం టూరు, బాపట్ల జిల్లాలో కిందిస్థాయి అధికారులే వాస్తవాలు చూపించకుండా తప్పుదారి పట్టించారని రైతు సంఘాల నాయకులు, ప్రతిపక్ష నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు అధికారులు ఇటువైపు ఎన్ని అక్రమాలు జరిగినా కన్నెత్తయినా చూడలేదని, ఇప్పుడు జిల్లా కలెక్టరే రావటంతో అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందనే ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. అయితే తనిఖీలకు ముందే తవ్వకాలు ఆపేసి ఉండటం, అక్కడ ఏమీ జరగటంలేదన్నట్టు చూ పించటానికి మిగిలిన శాఖల అధికారులు ప్రయత్నం చేశారు. అయినా గుంటూరు కలెక్టర్ మాత్రం లోపలకు వెళ్లిమరీ పరిశీలించారు. అయితే నిన్నటివరకు తవ్విన ప్రాంతం కాకుండా, కొత్తగా తవ్వటానికి వేసిన గాలుమార్గంలో చూపించటంతో స్థానికులు నిరాశకు గురయ్యారు.

పాత్రికేయునిపై దాడి

కొల్లూరు, అమరావతి, కొల్లిపర, ఫిబ్రవరి14: కొల్లూరు మండలం జువ్వలపాలెం వద్ద కృష్ణానది ఇసుక రీచ్‌ను కలెక్టర్ పి.రంజిత్‌బాషా బుధవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా చింతల్లంకకు చెందిన తోడేటి సురేష్ పెదలంక గ్రామ పరిధిలోని అరవింద వారధి సమీపంలో జరుగుతున్న ఇసుక తవ్వకాల గురించి కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అక్రమ తవ్వకాలపై స్పందనలో అర్జీ అందించామని, ఆ కాపీలను నదీ పరీవాహక శాఖతో పాటు మైనింగ్ శాఖ ఏడీకి కూడా పంపినట్లు కలెక్టర్‌కు తెలిపారు. స్పం దించిన కలెక్టర్ ఇసుక తవ్వకాలు పరిశీలించి విచారణ చేసి తనకు నివేదిక అందించాలని సూచించారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని మల్లాది, కోనూరు రీచ్‌లను పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పరిశీలించారు. కలెక్టర్ వెళ్లిపోయిన 15గంటల్లో మరలా ఇసుక అక్రమ క్వారీయింగ్ ప్రారంభించారు. వైసీపీ వర్గీయులు బుధవారం ఉదయం నుంచి వైకుంఠపురం, మల్లాది గ్రామాల్లో క్వారీయింగ్ చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణాను కవర్ చేసేందుకు వెళ్లిన ఓ పాత్రికేయునిపై వైసీపీ నాయకుని అనుచరులు దాడిచేసి అతని వద్దనున్న సెల్‌ఫోన్ తీసుకుని భయానక వాతావరణాన్ని సృష్టించారు. మల్లాది రీచ్‌లోకి వెళ్లిన తనను గ్రామానికి చెందిన వెంపా శ్రీను, తులసి తిరుపతిరావుతో పాటు మరికొందరు తనను హత్య చేసేందుకు ప్రయత్నించారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పాత్రికేయుని ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బ్రహ్మం తెలిపారు. గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి బుధవారం మండలంలోని బొమ్మువానిపాలెం, వల్లభాపురం ఇసుక రీచ్‌లను తనిఖీ చేశారు.


అక్రమాలు బహిరంగం..


బాపట్ల : జువ్వలపాలెం వద్ద ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కొల్లిపర, దుగ్గిరాల, మంగళగిరి, తాడేపల్లి మండలాల పరిధిలోని కృష్ణా తీరంలో ఇసుక తవ్వకాలు బహిరంగంగానే జరుగుతున్నాయి. ఒక్కో రీచ్‌లో నిబంధనలతో పనిలేకుండా ఏడు నుంచి 15 అడుగుల లోతు లో ఇసుక తవ్వకాలు జరుపుతున్నా రు. నిబంధనలను ఎంత దారుణంగా అతిక్రమిస్తున్నారనే దానికి దుగ్గిరాల మండలంలోని పెదకొండూరు దగ్గర అక్రమ తవ్వకాలపై అధికార పార్టీ నేతలే ఫిర్యాదు చేయటం నిదర్శనం. ఇదేతరహాలో కొల్లిపర మండలంలోని రీచ్‌లపైనా పలు ఫిర్యాదులు అందా యి. అయితే అక్రమ తవ్వకాలు జరుపుతున్న రీచ్‌లను వదిలేసి, రెండురోజుల క్రితం తవ్వకాలు ఆపేసిన మున్నంగి రీచ్‌ను సిబ్బంది చూపించటం కూడా స్థానికుల విమర్శకు తావిస్తోంది. అయితే అక్రమ తవ్వకాలను పట్టుకునే ఆలోచనతో గుంటూరు జిల్లా కలెక్టర్ నది లోపలకి వెళ్లిమరీ పరిశీలించారు. కానీ కిందిస్థాయి సిబ్బంది మాత్రం నిన్నటి వరకు తవ్వకాలు జరిపిన చోటకు వేసిన పాత గాలు మార్గం నుంచి కాకుండా, ఇటీవల మరోచోట తవ్వేందుకు కొత్తగా వేసిన గాలులోకి తీసుకెళ్లారనేది విమర్శ. ఈ గాలులో లారీ వెళ్లటమే కానీ, తిరగి రావటానికి వీలుగా వేయలేదు. పనులు పూర్తికాకపోవటంతో అసంపూర్తిగానే ఉంది. ఈ రీచ్‌లో రెండు రోజులకోసారి దొంగ ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. అయితే లారీ వెనక్కు నడిపించుకు వెళ్లి మరీ ఇసుక పోసుకొస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇదే విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లేందుకు స్థానికులు ప్రయత్నించినా వారిని ఆయన దగ్గరి వరకు వెళ్లనివ్వకుండానే సిబ్బంది అడ్డుకున్నారు. అప్పటికీ స్థానికుడు ఒకరు తన ఫోన్‌లో ఈ తనిఖీల వ్యవహారాన్ని, కిందిస్థాయి సిబ్బంది అత్యుత్సాహాన్ని వీడియో తీస్తుంటే, అతనిని పట్టుకుని మైనింగ్ శాఖలో ఓ అధికారి ఫోన్ తీసుకుని, ఆ వీడియోలను మొత్తం డిలీట్ చేయించి మరీ బయటకు పంపటం విశేషం. కొత్తబొమ్మువానిపాలెంలో బుసక పేరుచెప్పి ఇసుకతరలించేస్తున్నా, వల్లభాపురం దగ్గర అనుమతి తీసుకుని, మున్నంగి దగ్గర ఇసుక తవ్వుతున్నా, మున్నంగి, అత్తలూరివారాపాలెం, కొల్లిపర దగ్గర భారీగా ఇసుక కొండలను పోలిన గుట్టలు పోసి ఉంచినా వాటిపై ఆరా కూడా తియ్యకుండా, భారీ ఇసుక లోడుతో నీరు కారిపోతూ లారీలు కనిపించినా వాటినీ ఆపకుండా తనిఖీలు మాత్రం చేశామనిపించటానికి కిందిస్థాయి సిబ్బంది తాపత్రయపడ్డారు. వాస్తవానికి మైనింగ్ శాఖ అనుమతి ఇచ్చిన చోట అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా లోకేషన్ ప్రాకారం చూస్తే గుట్టు బయటపడేది. జిల్లా కలెక్టర్ రాకముందే అధికారుల బృందం అన్నీ ముందస్తుగా పరిశీలించి చూడాల్సిన ప్రదేశాలను నిర్ణయించటం విశేషం. మరి గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఏమి నివేదిక అందుతుందో! అక్రమార్కులపై చర్యలు ఎంతవరకు ఉంటాయో!

అంతా రహస్యమే.. ఎవరికోసం!

ఇసుక రీచ్‌లలో అక్రమాలు జరుగుతున్నాయని, పర్యావరణానికి ముప్పు ఏర్పడుతోందంటూ పదేపదే ఎన్జీటీని స్థానికులు ఆశ్రయిస్తుండటం, ఎన్జీటీ ఆదేశాలు జారీచేసి అధికారులను అమలు జరపమని చెప్పటం ప్రతిసారీ జరగుతూనే ఉన్నాయి. అయితే ఈసారి ఎన్జీటీ మరో అడుగు ముందుకువేసి ఇసుక అక్రమ తవ్వకందారులపై చర్యలు తీసుకోవాలంటూ ఆయా జిల్లాల పాలనాధికారులను ఆదేశించింది. దీంతో కలెక్టర్‌లు రీచ్‌ల తనిఖీలు చేపట్టారు. ఇప్పటికే పల్నాడు కలెక్టర్ రీచ్‌లను పరిశీస్తే, బుధవారం గుంటూరు, బా పట్ల కలెక్టర్లు ప్రకాశం బ్యారేజికి దిగువునున్న కృష్ణా తీరంలోని ఇసుక రీచ్‌లను పరిశీలించారు. బాపట్ల కలెక్టర్ కొల్లూరు మండలం జువ్వలపాలెంలో ఇసుక రీచ్‌ను పరిశీలించారు. అయితే అక్కడ తవ్వకాలు చాలాకాలం క్రితం ఆపేశారు. ప్రస్తుతంగాజుల్లంక, పెదలంక దగ్గర ఇసుక, చిలుమూరులో బుసక తవ్వకాల పేరుతో నిత్యం తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. ఇవి కూడా రెండ్రోజులుగా ఆపారు. జువ్వలపాలెం రీచ్‌ను ఒడ్డునుంచే చూడాల్సి వచ్చింది. ఎందుకంటే నది ఒడ్డువెంట నీటిపాయ ప్రవహిస్తోంది. అటువంటిచోట తవ్వకాలుఎట్లా జరుపుతారనే ఆలోచన కూడా చేయకుండా సిబ్బంది కలెక్టర్‌ల బృందాన్ని తప్పుదారి పట్టించారని ఆరోపిస్తున్నారు. కొల్లూరు మండలం పెదలంక దగ్గర ఇసుక అనుమతి లేకుండా తవ్వుతున్నారని, మైనింగ్ అధికారులు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని, దయచేసి మీరైనా పెదలంక వచ్చి పరిశీలించాలని రైతు సంఘం నాయకుడు సురేష్ కలెక్టర్‌ను అభ్యర్థించారు.


GCKC Projects and Works Pvt Ltd.,
D.No.59A-8-7/2, Flat No. 32, Sai Baba Temple Street, RTC Colony, Benz Circle, VIJAYAWADA-520008.
GSTIN : 37AADCG4669D1ZJ
SAND WAY BILL
DMG Work Order No.
Date

వైకుంఠపురం ఇసుక రవాణాకు ఇస్తున్న వే బిల్లులు


కొల్లిపర: బొమ్మువానిపాలెం ఇసుక రీచ్‌లో కలెక్టర్ తనిఖీ అనంతరం యథాతథంగా కొనసాగుతున్న ఇసుక లోడింగ్

రాజధానిలో ఇష్టారాజ్యం..

తుళ్లూరు మండ లంలోని పలు ఇసుక రీచ్‌లు ప్రకాశం బ్యారేజ్ రిజర్వాయర్ పరిధిలో ఉన్నాయి. దీని దృష్ట్యా అక్కడ ఇసుక తవ్వకాలను గతంలోనే ఎన్‌జీటీ నిషేధించింది. అయినప్పటికీ అధికార వైసీపీ నేతలు మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారుల అండదండలతో చెలరేగిపోతున్నారు. ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు జరుపుతూ అందినకాడికి వెనకేసుకొంటున్నారు. ఇసుక రీచ్‌లను కొంతమంది నేతలకు అప్పగించి వారి ద్వారా తాడేపల్లి ఆఫీసుకు పెద్దమొత్తంలో నగదు చేరేలా ఒక వ్యవస్థని రూపొందించుకొన్నారని గత కొన్ని నెలలుగా ప్రతిపక్ష టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు. తాడేపల్లిలో ఇసుక రీచ్‌లు అయితే కృష్ణా జిల్లా వైసీపీకి చెందిన ఒక యువ నాయకుడికి కేటాయించారు. అలానే దుగ్గిరాల, కొల్లిపరలోనూ అధికార వైసీపీ నేతలదే పెత్తనమంతా. గతంలో మైనింగ్, పోలీసు, రవాణ శాఖ అధికారులు అడపాదడపా దాడులు నిర్వహించి ఇసుక లారీలు, యంత్రాలను సీజ్ చేసేవారు. గత కొన్ని నెలల నుంచి ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఇక్కడి మైనింగ్ శాఖకు సంబంధం లేకుండా అంతా విజయవాడ రాష్ట్ర కార్యాలయం కనుసన్నల్లోనే ఇసుక రీచ్‌ల కాంట్రాక్టుల వ్యవహారం నడుస్తోంది. గత వారం జనసేన నేత వల్లభనేని బాలశౌరి ఇసుక రీచ్‌లలో జరుగుతున్న అక్రమాలను ఎండగట్టారు. త్వరలోనే ఈడీ, ఐటీ, సీబీఐ వంటి సంస్థలు వచ్చే అవకాశం ఉందని, అధికారులు పీకల్లోతు కూరుకుపోయారు, ఇకపై తప్పు చేయొద్దని హితవు పలికారు. అయితే అధికారులు పెడచెవిన పెట్టారు. ఇప్పుడు ఎన్‌జీటీ నుంచి ఆదేశాలు రావడంతో ఏమి జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.

అసమ్మతి తగ్గేదేలే..!

- అనిల్ సభకు నేతలు డుమ్మా
- ఫలించని బుజ్జగింపు ప్రయత్నాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జిల్లాలో వైసీపీ అభ్యర్థులకు అసమ్మతి బెడద రోజు రోజుకు పెరుగుతోంది. అభ్యర్థులకు వ్యతిరేకంగా నియోజకవర్గాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అభ్యర్థులను ప్రకటించినా అసమ్మతి నేతలు తగ్గేదేలే అన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. నరసరావుపేట లోకసభ స్థానానికి ఎమ్మెల్యే అనిల్ కుమార్‌యాదవ్‌ను వైసీపీ అభ్యర్థిగా ఖరారు చేసిన నేపథ్యంలో నరసరావుపేటలో బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సభకు అసమ్మతి నేతలు డుమ్మా కొట్టడం గమనార్హం. అనిల్‌కుమార్ యాదవ్‌కు సబంధించిన వ్యక్తులు కూడా సదరు నేతలను ఫోన్ ద్వారా ఆహ్వానించినప్పటికీ వారు సభకు హాజరు కాలేదు. అసమ్మతి నేతల గైర్హాజరు పార్టీలో చర్చనీయాంశమైంది.

పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అసమ్మతి నేతలను బుజ్జగించేందుకు అభ్యర్థులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడంలేదు. కొన్ని నియోజకవర్గాల్లో సదరు నేతలు కొరకురాని కొయ్యగా తయారయ్యారు. పలు నియోజక వర్గాల్లో అభ్యర్థులను మార్చాల్సిందేనని భీష్మించుకొని కుర్చున్నారు. అధిష్టానం తన నిర్ణయాన్ని మార్చుకోకుంటే ఎన్నికల్లో వ్యతిరేకంగా పనిచేస్తామని తేల్చి చెబుతున్నారు. ఈ సభ సందర్భంగా మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుల హవా స్పష్టంగా కనిపించింది. పట్టణంలో ఎక్కడి చూసినా వీరి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలే కనిపించాయి. నరసరావుపేట, వినుకొండ, సత్తెనపల్లి, చిలకలూరిపేట, గురజాల నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేలు, పార్టీ అభ్యర్థులను వ్యతిరేకిస్తున్న నేతలు, కార్యకర్తలు అనిల్‌కుమార్ సభకు హాజరు కాకుండా వారి నిరసన తెలిపారు. నియోజకవర్గాల్లో కూడా వారు అభ్యర్థులకు వ్యతిరేకంగానే పనిచేస్తున్నారు. అయితే ఆయా నియోజకవర్గాలను ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులను ప్రకటించినా అసమ్మతి సద్దుమణగకపోవడం గమనార్హం. ఇప్పటికైనా పునరాలోచన చేయాలని అధిష్టానాన్ని సదరు నేతలు కోరుతున్నారు. వీరినే అభ్యర్థులను కొనసాగిస్తే వారికి వ్యతిరేకంగా పనిచేయడం ఖాయమని స్పష్టం చేస్తున్నారు. విజయసాయిరెడ్డి అసమ్మతి నేతలతో చర్చలు జరిపినా ప్రయోజనం లేకపోయిందన్న ప్రచారం జరుగుతోంది.

జయం మనదే..

- ఎక్కడ అవమానపడ్డారో అక్కడే కాలరెగరేసేలా చేస్తా
- నేను, బ్రహ్మారెడ్డి మీకు అన్నదమ్ముల్లా ఉంటాం
- దొంగ మందు అమ్ముకునే అన్నదమ్ములను ఆలోచిస్తాం
- గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని

మాచర్ల, ఫిబ్రవరి14: మరో రెండు నెలలు కష్టపడితే మనదే రాజ్యం.. మనదే అధికారం.. ఎక్కడ అవమానపడ్డారో అక్కడే కాలరెగరేసేలా చూస్తానని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీని వాస రావు టీడీపీ నేతలు, కార్యకర్తల్లో ధైర్యం నింపారు. మాచర్లలో బుధవారం పార్టీ కార్యాల యాన్ని ప్రారంభించిన అనంతరం పట్టణంలోని నెహ్రూనగర్‌లో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. తమ పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వాళ్లను గుర్తు పెట్టుకుంటామన్నా రు. చంద్రబాబు నాయుడు మంచి వారు.. మా జోలికి రారు అని పోలీసు అధికారులు అనుకుంటున్నారు.. కానీ ఇక్కడ ఎర్ర డైరీ ఉంది.. డైరీలో మీరు ఎక్కారంటే మీ పోస్టింగ్ ఊస్టింగే అని గుర్తు పెట్టుకోవాలని హెచ్చరించారు. టీడీపీ, జనసేన నేతలు రోజూ, ప్రతి గంటా కీలకంగా భావించి బ్రహ్మారెడ్డి గెలుపులో కీలకపాత్ర పోషించాలన్నారు. మాచర్ల నియోజకవర్గంలో బీసీలను వైసీపీ పొట్టన పెట్టుకున్నారన్నారు. మాచర్ల నియోజకవర్గంలో బ్రహ్మారెడ్డి భారీ మెజార్టీతో గెలవబోతున్నారన్నారు. నేను, బ్రహ్మారెడ్డి మీకు అన్నదమ్ముల్లా ఉంటూ మిమ్మల్ని కాపాడుకుంటామని భరోసానిచ్చారు. నియోజకవర్గంలో పార్టీ ఎమ్మెల్యే లేకపోయినా పార్టీ జెండా మోసిన కార్యకర్తలను మర్చిపోమన్నారు. దొంగ మందు అమ్ముకునే అన్నదమ్ములను.. వారికి మద్దతుగా నిలిచిన పోలీసుల గురించి ఆలోచిస్తామని పిన్నెల్లి సోదరులనుద్దేశించి అన్నారు. వెల్దుర్తి ఎస్ఐ హీరోలా చెలామణి అవుతున్నాడు.. మిస్టర్ వెల్దుర్తి ఎస్ఐ నీ యూనిఫాం విప్పించి పోస్టింగ్ తీసేసి అదే పోలీస్‌స్టేషన్లో కేసు పెట్టి జైలుకు పంపించకపోతే ఇది టీడీపీనే కాదు అంటూ మండిపడ్డారు. నియోజకవర్గంలో ఇష్టానుసారంగా వ్యవహరించి మా కార్యకర్తలను ఇబ్బంది పెట్టారో, హత్యలు చేయించారో ఆ పోలీసు అధికారులు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని యరపతినేని అన్నారు. హలో ఏపీ బైబై వైసీపీ.. హలో మాచర్ల బైబై పిన్నెల్లి బ్రదర్స్. సైకో పోవాలి సైకిల్ రావాలి అంటూ నేతలు, కార్యకర్తలు నినాదాలు చేశారు.


ప్రసంగిస్తున్న యరపతినేని, బ్రహ్మారెడ్డి తదితరులు

గంజాయి పొట్లాలు దిగాయట..

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి

200 గంజాయి పొట్లాలు దిగాయట.. ఏ పొట్లం ఏ ఇంట్లో చేరిద్దో భయంగా ఉంది.. తెలంగాణ లిక్కరు కూడా పక్కనే ఉంది.. లోడులు కూడా తెప్పిస్తారు.. టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. పార్టీ ముఖ్య నేతలంతా సీసీ కెమెరాను ఇంటి ముందు పెట్టించుకోవాలన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడితే మాత్రం భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని సెబ్ అధికారులనుద్దేశించి అన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ బోర్లను స్వాధీనం చేసుకొని నీళ్ల వ్యాపారం చేస్తున్నారన్నారు. ప్రజల వద్ద నుంచి నెలకు రూ.500 చొప్పున వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి నీళ్లివ్వడు కానీ.. వీధివీధినా నాటుసారా, లిక్కర్ అమ్ముతాడం టూ ఎద్దేవా చేశారు. మరోమారు వైసీపీ గెలిస్తే అవయమాలను కూడా అమ్ముతారన్నారు. గుండె శాఖ, కిడ్నీ శాఖ, లివర్ శాఖ అంటూ మొత్తం అమ్మేస్తారన్నారు. పోలీసు వేధింపులతో మ త్స్యకారుడు ఆత్మహత్య చేసుకుంటే సెటిల్‌మెంట్ చేసి ప్రాణాలకు విలువ కడుతున్నారన్నారు. ప్రజా సునామీని తట్టుకోవడం పిన్నెల్లి సోదరులకు సాధ్యం కాదన్నారు. కుటుంబసభ్యులకే న్యాయం చేయలేని వ్యక్తి రాష్ట్రానికి ఏం మేలు చేస్తాడని ప్రశ్నించారు. సామాజిక న్యాయం చేయగలిగే పార్టీ టీడీపీ మాత్రమే అన్నారు. నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పట్ల భావోద్వేగం బాధ్యత ఉన్న వ్యక్తిని తానేనన్నారు. రానున్న ఎన్నికల్లో తనను ఆశీర్వదించి గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధి చూపిస్తానని అన్నారు.


మాచర్ల పట్టణంలో నిర్వహిస్తున్న ర్యాలీ

సత్తాచాటిన కేశవరెడ్డి

ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి గతంలో అత్యంత సన్నిహితునిగా ఉన్న యెనుముల కేశవరెడ్డి అత్యంత హంగు ఆర్భాటాలతో బుధవారం టీడీపీ కండువా కప్పుకున్నారు. అలాగే విద్యాధరణి మురళి కూడా టీడీపీ కండువా కప్పుకున్నారు. మాజీ కౌన్సిలర్ కొండూరు లెనిన్‌బాబు, శ్రీనివాసరావు, గోపి, జానీ, దరియాబిలతోపాటు వందల మంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరిని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, బ్రహ్మారెడ్డిలు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముందుగా పట్టణంలో భారీ ర్యాలీ జరిపారు. బాణా సంచా పేలుళ్ల దీపావళి పండుగను తలపించాయి. కార్యక్రమంలో కుర్రి శివారెడ్డి, కొమెర దుర్గారావు, నేరేటి వీరాస్వామి యాదవ్, వజ్రం నాయక్, మేకల దాసు, సింగు నాగేశ్వరరావు, జనసేన అధికార ప్రతినిధి నక్షత్రపు ప్రసాద్, బూసా రామాంజినేయులు, పులి హరి తదితరులు పాల్గొన్నారు.

తప్పదు.. మీరూ.. రండి!

- కార్యక్రమానికి అందరూ రావాల్సిందేనని అధికారుల ఆదేశాలు
- వలంటీర్స్ వందనానికి సచివాలయాల సెక్రెటరీలు ఎందుకు?

గుంటూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): తాడికొండ నియోజకవర్గంలోని ఫిరంగిపురం మండలం రేపూడిలో గురువారం (నేడు) జరగనున్న వలంటీర్స్‌కి వందనం కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా అన్ని సచివాలయాల సెక్రెటరీలు తప్పక హాజరు కావాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ కార్యక్రమానికి సచివాలయాల సెక్రెటరీలకు ఎలాంటి సంబంధం లేకపోయినా మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోల నుంచి బుధవారం సాయంత్రమే అందరి ఫోన్లకు ఎస్ ఎంఎస్‌లు పంపారు. వలంటీర్లందరిని సీఎం జగన్ సభకు తీసుకొచ్చే బాధ్యత సెక్రెటరీలదేనని స్పష్టం చేశారు. ఇందు కోసం రెండేసి సచివాలయాలకు కలిపి ఒక బస్సు ఏర్పాటు చేశామని, నల్లపాడు రోడ్డులోని రెడ్డి కళాశాల వద్ద ఉన్న మైదానంలో వర్కింగ్ లంచ్ కూడా ఏర్పాటు చేయడం జరి గిందని తెలిపారు. వలంటీర్లు, సచివాలయాల సెక్రెటరీలకు అటెండెన్స్ కూడా తీసుకొంటామని, దీని దృష్ట్యా తప్పక హాజరు కావాల్సిందేనని చెప్పారు. ఈ నేపథ్యంలో గురువారం జిల్లావ్యాప్తంగా సచివాలయాలు మూతబడే పరిస్థితి ఉత్పన్నమైంది.

ఏటా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.40 లక్షల మంది వలంటీర్లకు వైసీపీ ప్రభుత్వం సన్మానం చేస్తోంది. ఈ ఏడాది వలంటర్స్‌కి వందనం కార్యక్రమాన్ని జిల్లాలోని ఫిరంగిపురం మండలంలో రేపూడిలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు కొద్ది రోజుల నుంచి అక్కడ సభా ప్రాంగణం ఏర్పాట్లు జరుగుతున్నాయి. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కుర్చీలన్ని నిండేలా జన సమీకరణ చేసే బాధ్యతని సచివాలయాల సెక్రెటరీలకు కేటాయించారు. జిల్లా మొత్తం మీద వలంటీర్లు 10 వేల మంది కూడా ఉండరు. ఈ నేపథ్యంలో సచివాలయాల సెక్రెటరీలను కూడా సభకు రావాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా మహిళా పొదుపు సంఘాల సభ్యులను కూడా తీసుకురావాలని అనధికారికంగా చెప్పారు. వాస్తవానికి బీఎల్‌వోలుగా డ్యూటీలు చేస్తున్న సచి వాలయాల సెక్రెటరీలు ఎస్ఎస్ఆర్ - 2024 తుది ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం వేలల్లో వస్తున్న ఫారం-6, 7, 8లను పరిష్కరించే పనిలో తలమునకలై ఉన్నారు. అలాంటిది వారిని సీఎం సభ కోసం విధులన్ని పక్కన పడేసి రావాలని ఆదేశాలు జారీ చేయడంపై విమర్శలు వ్యక్తమౌతోన్నాయి.

రాజ్యాంగ పరిషత్

దిక్సూచి DIKSUCHI

స్వాతంత్ర్యానంతరం మౌంట్ బాటన్ 1948 జూన్ 21 వరకు గవర్నర్ జనరల్‌గా కొనసాగారు. తరవాత సి.రాజగోపాలచారి 1950 జనవరి 24 వరకు గవర్నర్ జనరల్‌గా పనిచేశారు. పాకిస్థాన్‌కు మహమ్మదాలి జిన్నాను గవర్నర్ జనరల్‌గా నియమించారు.

నెహ్రూ తాత్కాలిక ప్రభుత్వం: స్వాతంత్ర్యానంతరం నెహ్రూ నాయకత్వంలో ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వంతో మౌంట్ బాటన్ ప్రమాణ స్వీకారం చేయించారు.

1. జవహర్‌లాల్ నెహ్రూ - ప్రధాని, విదేశీ వ్యవహారాలు
2. సర్దార్ వల్లభభాయ్ పటేల్ - ఉప ప్రధాని, హోంశాఖ
3. బాబూ రాజేంద్రప్రసాద్ - వ్యవసాయం, ఆహారం
4. మౌలానా అబుల్ కలామ్ అజాద్ - విద్యాశాఖ
5. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ - న్యాయశాఖ
6. సర్దార్ బలదేవ్‌సింగ్ - రక్షణశాఖ
7. షణ్ముగం శెట్టి - ఆర్థికశాఖ
8. జాన్ ముత్తాయ్ - రైల్వేలు, ఉపరితల రవాణా
9. బాబూ జగజ్జీవన్‌రామ్ - కార్మికశాఖ
10. రఫి అహ్మద్ కిద్వాయ్ - కమ్యూనికేషన్లు, పౌర విమానయానం
11. సిహెచ్.బాబా - వాణిజ్యం
12. ఎన్.వి.గాడ్గిల్ - గనులు, విద్యుత్
13. రాజ్‌కుమారి అమృత్‌కౌర్ - ఆరోగ్యం, వైద్యశాఖ
14. డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ - పరిశ్రమలు

● భారత జాతి భవిష్యత్తు కోసం రాజ్యాంగం కావాలని, అందుకు రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు కావాలని మొదటిసారి సుప్రసిద్ధ రాడికల్ మానవతావాది ఎం.ఎన్.రాయ్ అభిప్రాయపడ్డారు. అయితే అంతకుముందే రాజ్యాంగానికి సంబంధించిన కొన్ని డిమాండ్లు ఉన్నాయి. 1918లో ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ సమావేశం 'స్వయం నిర్ణయాధికారం' అనే భావనతో ఒక తీర్మానాన్ని ప్రకటించింది. ఇదే విషయాన్ని గాంధీ 'యంగ్ ఇండియా' పత్రికలో ప్రస్తావిస్తూ 1922 జనవరి 5న 'భారత దేశానికి స్వాతంత్ర్యమనేది బ్రిటిష్‌వారు ఇచ్చే భిక్ష కాదని, భారతీయులు రాజకీయ భిక్షాటకులు కాదని, ప్రజలు తమను తాము అభివ్యక్తీకరించుకోడానికి గల 'స్వేచ్ఛ మాత్రమేనని' రాశారు. 1928 మే 19న మోతీలాల్ నెహ్రూ అధ్యక్షతన రాజ్యాంగ రచనకు అఖిలపక్ష కమిటీ ఏర్పాటైంది. ఇది భారతీయులకే సొంత రాజ్యాంగ రచన కోసం జరిగిన నిర్మాణాత్మక కృషిగా పేర్కొంటారు. ఈ నెహ్రూ నివేదికలో భారతీయుల హక్కులు, ప్రభుత్వ పాలన, భిన్నవర్గాల ప్రయోజనాలను చర్చించారు.

● 1935 చట్టాన్ని ఏకపక్షంగా అమలుపరిచే ప్రయత్నం చేయడంతో 1936 జైపూర్ కాంగ్రెస్ సమావేశంలో దానిని ముక్తకంఠంతో వ్యతిరేకించారు. ప్రత్యేక రాజ్యాంగ డిమాండ్‌ను పునరుద్ఘాటించారు. 1936లో జవహర్‌లాల్ నెహ్రూ 'హెరాల్డ్' పత్రికలో భారతీయులు తమను తాము పాలించుకోడానికి అవసరమైన చట్టాన్ని తయారుచేసుకొనే స్వేచ్ఛ కల్పించాలని రాశారు. ఈ అంశాన్ని 1935 నాటి హరిపుర కాంగ్రెస్ సమావేశం ఒక తీర్మానం రూపంలో ఆమోదించింది. భారతీయులతో రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు చేస్తే కుల, మత, వర్గాల సమస్యకు పరిష్కారం దొరుకుతుందని మహాత్మాగాంధీ 1939 నవంబరు 12న 'హరిజన' పత్రికలో రాశారు. ఈ డిమాండ్లను దృష్టిలో ఉంచుకొని బ్రిటిష్ ప్రభుత్వం 1942 క్రిప్స్ ప్రతిపాదనల ద్వారా తొలిసారిగా రాజ్యాంగ పరిషత్ అవసరాన్ని గుర్తించారు. రెండో ప్రపంచ యుద్ధానంతరం ఇంగ్లాండ్‌లో అధికారంలోకి వచ్చిన లేబర్ పార్టీ ప్రధాని అట్లీ, భారతీయులపై బల ప్రయోగం ద్వారా అధికారాన్ని చెలాయించలేమని నిర్ణయానికి వచ్చారు. 1945 సెప్టెంబరులో భారతీయులకు రాజ్యాంగ పరిషత్‌ను ఏర్పాటు చేయాలని బ్రిటన్ ప్రభుత్వం సంకల్పించింది. ఈ మేరకు 1945 సెప్టెంబరు 19న నాటి వైశ్రాయ్ వేవెల్, ఢిల్లీ రేడియో కేంద్రం ద్వారా ప్రసంగిస్తూ 'అతి త్వరలో రాష్ట్ర శాసనసభలకు ఎన్నికలు జరుగుతాయి. వాటికి ఎన్నికైన ప్రతినిధులు రాజ్యాంగ సభ సభ్యులను ఎన్నుకుంటారు' అని పేర్కొన్నారు. 1946 నాటికి మంత్రిత్రయ రాయబారాన్ని అనుసరించి రాజ్యాంగ పరిషత్‌కు ఎన్నికలు జరిగాయి.

పోటీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ



రాజ్యాంగ సభ నిర్మాణం: 1946 జూన్, జూలై నెలల్లో సభకు ఎన్నికలు జరిగాయి. నాటి గవర్నర్ జనరల్ ఈ ఎన్నికలు నిర్వహించారు. ఒక మిలియన్ జనాభాకు ఒక సభ్యుని చొప్పున 389 మంది సభ్యులకు ప్రాతినిధ్యం, మూడు భిన్నమైన వర్గాల నుంచి ప్రతినిధుల ఎంపిక జరిగింది. ఈ ఎన్నికలు నైసర్గిక ప్రాతినిధ్య పద్ధతి ఆధారంగా జరిగాయి.

1. బ్రిటిష్ పాలిత ప్రాంతాల నుంచి పరోక్షంగా ఎన్నుకున్నవారు 292
2. స్వదేశీ సంస్థానాల నుంచి నియమించిన వారు 93
3. చీఫ్ కమిషనర్ ప్రాంతాల్లో ఎన్నుకున్నవారు
4. మొత్తం 389 మంది.

నోట్: చీఫ్ కమిషనర్ ప్రాంతాలు నాలుగు అవి- 1) అజ్మీర్-మేర్వార్ 2) బెలూచిస్థాన్ 3) కూర్గ్ 4) ఢిల్లీ. - ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 208, ముస్లిం లీగ్‌కు 73, ఇతరులు 15 మొత్తం 296. స్వదేశీ సంస్థానాలు 93తో కలిపి మొత్తం 389.

- ముస్లింలీగ్ పాకిస్థాన్ డిమాండ్‌తో రాజ్యాంగ పరిషత్ నుంచి వైదొలిగింది. దేశ విభజన తరవాత రాజ్యాంగసభ సభ్యుల సంఖ్య 299కి పడిపోయింది. ఇందులో బ్రిటిష్ పాలిత ప్రాంతాల ప్రతినిధులు 229, స్వదేశీ సంస్థానాల ప్రాతినిధ్యం 70 కలిపి మొత్తం 299.
- గాంధీ, జిన్నా రాజ్యాంగ సభకు ఎన్నిక కాలేదు.
- ముస్లింలకు, సిక్కులకు ప్రత్యేక నియోజకవర్గాలను ఏర్పాటు చేశారు.
- రాజ్యాంగ పరిషత్‌కు 15 మంది ప్రముఖులను నామినేట్ చేశారు.
- రాజ్యాంగ పరిషత్‌కు ఎన్నికైన మహిళలు: విజయలక్ష్మీ పండిట్, సరోజిని నాయుడు, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, హంసా మెహతా, రాజ్‌కుమారి అమృత్‌కౌర్.
- ఆంధ్ర ప్రాంతం నుంచి ఎన్నికైనవారు: టంగుటూరి ప్రకాశం, పట్టాభి సీతారామయ్య, నీలం సంజీవరెడ్డి, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్, కల్లూరి సుబ్బారావు, కళా వెంకట్రావ్, ఆచార్య ఎన్.జి. రంగా, రామకృష్ణ రంగారావు, ఎం.సత్యనారాయణ.



వి.చైతన్యదేవ్
సీనియర్ ఫ్యాకల్టీ

సివిల్ సర్వీసెస్ / ఐఎఫ్‌ఎస్ ఎగ్జామ్ 2024

సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(సీఎస్ఈ), ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఎగ్జామ్ 2024 నోటిఫికేషన్లను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) విడుదల చేసింది. సీఎస్ఈ ద్వారా 1056, ఐఎఫ్ఎస్ సర్వీస్‌లో 150 పోస్టులు భర్తీ చేస్తారు.

అర్హతలు: ఏదైనా గుర్తింపు పొందిన విద్యా సంస్థల నుంచి బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమాన కోర్సులో ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు: 21 నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి. ప్రభుత్వ నిబంధనల మేరకు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపులు ఉంటాయి.

దరఖాస్తు ఫీజు: ఓబీసీ, ఇతర అభ్యర్థులకు రూ.100. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఎంపిక: ప్రిలిమినరీ పరీక్ష, మెయిన్స్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 5 **ప్రిలిమినరీ పరీక్ష:** మే 26

మెయిన్స్ పరీక్ష: అక్టోబరు 19 నుంచి **వెబ్‌సైట్:** upsconline.nic.in/

కేంద్రీయ విద్యాలయలో టీచింగ్ స్టాఫ్

నల్లగొండ, మిర్యాలగూడలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ... కింద పేర్కొన్న టీచింగ్ స్టాఫ్ భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

ఖాళీల వివరాలు

1. **పీజీటీ:** హిందీ, ఇంగ్లీష్, మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, సీఎస్, బయాలజీ
2. **టీజీటీ:** హిందీ, ఇంగ్లీష్, సంస్కృతం, మేథ్స్, సైన్స్, సోషల్ సైన్స్ కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్.
3. ప్రీ ప్రైమరీ టీచర్స్, ప్రైమరీ టీచర్స్, కౌన్సెలర్, స్పెషల్ ఎడ్యుకేటర్, స్టాఫ్ నర్స్, యోగా ఇన్‌స్ట్రక్టర్, డ్యాన్స్ కోచ్, మ్యూజిక్ టీచర్, స్పోర్ట్స్ అండ్ ఫిట్‌నెస్ కోచెస్.

అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, పీజీ, డీఈడీ, బీఈడీ, డిప్లొమా/పీజీ డిప్లొమా ఉత్తీర్ణత. **వాక్ ఇన్ ఇంటర్వ్యూ తేదీ:** ఫిబ్రవరి 17

సమయం: ఉదయం 9 గంటల నుంచి

వెబ్‌సైట్: nalgonda.kvs.ac.in/

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/JWRKd0Cలో చదవండి.

హైదరాబాద్ ఐఐఐటీలో డిగ్రీ, డ్యూయెల్ డిగ్రీ



హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ)- బీటెక్, డ్యూయెల్ డిగ్రీ (బీటెక్+ఎంఎస్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన ప్రత్యేక అడ్మిషన్ మోడ్‌ల(ఎస్‌పీఈసీ, యూజీఈఈ) ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

బీటెక్: ఈ ప్రోగ్రామ్‌లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో 15 సీట్లు ఉన్నాయి. స్పెషల్ ఛానెల్ ఆఫ్ అడ్మిషన్స్(ఎస్‌పీఈసీ) మోడ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హత: మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు సీబీఎస్ఈ-ఉడాన్ స్కీంలో అర్హత పొందిన బాలికలు; జవహర్ నవోదయ విద్యాలయాల్లో పన్నెండోతరగతి ఉత్తీర్ణులు; పదోతరగతి తరవాత ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశం పొంది ప్రస్తుతం నాలుగో సెమిస్టర్ చదువుతున్నవారు అప్లయ్ చేసుకోవచ్చు.

బీటెక్+ఎంఎస్: ఈ ప్రోగ్రామ్‌లో బీటెక్, ఎంఎస్(రీసెర్చ్) కోర్సులు పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ విభాగాలు ఎంచుకోవచ్చు. ఈసీఈలో 25 సీట్లు, సీఎస్ఈలో 35 సీట్లు ఉన్నాయి. కంప్యూటర్ సైన్స్‌లో 45 సీట్లు ఉన్నాయి. బీటెక్‌లో కంప్యూటర్ సైన్స్ తీసుకొన్న అభ్యర్థులు ఎంఎస్‌లో కంప్యూటేషనల్ లింగ్విస్టిక్స్, కంప్యూటేషనల్ నేచురల్ సైన్సెస్, కంప్యూటింగ్ అండ్ హ్యూమన్ సైన్సెస్ స్పెషలైజేషన్‌లు ఎంచుకోవచ్చు. ఒక్కో స్పెషలైజేషన్‌కు 15 సీట్లు ప్రత్యేకించారు. అండర్‌గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(యూజీఈఈ) మోడ్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హత: ఈ జూన్ నాటికి మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **బీటెక్ డిగ్రీకి దరఖాస్తు ఫీజు:** రూ.600
- **డ్యూయెల్ డిగ్రీకి దరఖాస్తు ఫీజు:** పురుషులకు రూ.2,500; మహిళలకు రూ.1250
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 1
- **వెబ్‌సైట్:** iiit.ac.in



సినిమా షూటింగ్స్‌కు చిరంజీవి చిన్న బ్రేక్ ఇచ్చారు. శ్రీమతి సురేఖతో కలసి అమెరికా విహార యాత్రకు వెళ్లారు. ఈ విషయాన్ని ఆయన బుధవారం సోషల్ మీడియా ద్వారా తెలిపారు. 'సురేఖతో కలసి అమెరికా విహార యాత్రకు వెళ్తున్నాను. తిరిగిరాగానే 'విశ్వంభర' చిత్రీకరణలో పాల్గొంటాను. అందరికీ ప్రేమికుల దినోత్సవ శుభాకాంక్షలు' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. 'విశ్వంభర' చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల కానుంది. 'బింబిసార' ఫేం వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నారు. త్రిష కథానాయిక. భారీ సెట్స్‌లో

చిరు విరామం

ఇటీవలే కీలక ఘట్టాలను తెరకెక్కించారు. చిరంజీవి తిరిగిరాగానే మరో షెడ్యూల్ ప్రారంభించేందుకు యూనిట్ సిద్ధమవుతోంది. 'విశ్వంభర'కు కీరవాణి సంగీతం అందిస్తున్నారు.



భామతో బచ్చన్

రవితేజ, భాగ్యశ్రీ బోర్సే జంటగా హరీష్ శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్ తో సునాహోగా' అనేది ట్యాగ్‌లైన్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఈ చిత్రం నుంచి రవితేజ, భాగ్యశ్రీ బోర్సే రొమాంటిక్ స్టిల్‌ను మేకర్స్ విడుదల చేశారు. సినిమాకు సంబంధించిన పనులు శరవేగంగా సాగుతున్నాయని చిత్రబృందం తెలిపింది. ఇటీవలే కారంపూడిలో ఓ షెడ్యూల్‌ను యూనిట్ పూర్తి చేసింది. ఈ చిత్రానికి మిక్కీజే మేయర్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: అయనంక బోస్.

టైటిల్ ట్రాక్‌తో హరోం హర



సుధీర్‌బాబు కథానాయకుడిగా రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'హరోం హర'. మాళవిక శర్మ కథానాయిక. జ్ఞాన సాగర్ ద్వారక దర్శకత్వంలో సుమంత్ జి నాయుడు నిర్మించారు. సుధీర్ బాబు సరికొత్త లుక్‌లో కనిపించనున్నారు. ఈ చిత్రం నుంచి 'హరోం హర' అంటూ సాగే టైటిల్ ట్రాక్‌ను యూనిట్ బుధవారం విడుదల చేసి మ్యూజిక్ ప్రమోషన్స్ ప్రారంభించింది. కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించగా, చైతన్ భరద్వాజ్ స్వరాలు సమకూర్చారు. అనురాగ్ కులకర్ణి ఆలపించారు. 1980ల్లో చిత్తూరు జిల్లా కుప్పంలో జరిగిన యదార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కుతోందని యూనిట్ తెలిపింది. సునీల్ కీలకపాత్ర పోషిస్తున్నారు.

పుల్వామా అమరవీరులకు నివాళులు



వరుణ్‌తేజ్ తొలిసారిగా బాలీవుడ్‌లోకి అడుగుపెట్టి నటించిన చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్' మార్చి ఒకటిన తెలుగు, హిందీ భాషల్లో విడుదల కానుంది. మానుషి చిల్లర్ ఇందులో రాడార్ ఆఫీసర్‌గా, రుహానా శర్మ మరో కీలక పాత్రలో నటించారు. శక్తి ప్రతాప్ సింగ్ దర్శకత్వం వహించారు. 2019 ఫిబ్రవరి 14న జమ్ము-శ్రీనగర్ జాతీయ రహదారిపై భారత భద్రతా సిబ్బందిని తీసుకువెళుతున్న వాహనాల కాన్వాయ్‌పై జరిగిన ఉగ్ర దాడిలో నలభై మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు అమరులయ్యారు. పుల్వామా స్మారక ప్రదేశాన్ని హీరో వరుణ్‌తేజ్, మానుషి సహా 'ఆపరేషన్ వాలెంటైన్' టీమ్ సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. వైమానిక దళ ధైర్య సాహసాలు, త్యాగాల స్ఫూర్తితో వాస్తవ సంఘటనల ప్రేరణతో రూపొందిన ఈ చిత్రాన్ని సోనీ పిక్చర్స్, రినైసన్స్ పిక్చర్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి.

రాజకీయ చిత్రం కాదు.. ప్రజల సినిమా

దర్శకుడు భాను



'ఈ సినిమాను మొదట 'అమరావతి టైమ్స్' పేరుతో తీశాం. కానీ సెన్సార్‌కు వెళ్లినప్పుడు ఫిక్షనల్ స్టోరీ అయితేనే సెన్సార్ చేస్తామని అధికారులు చెప్పారు. వారు చెప్పిన ప్రకారం మార్పులు చేసి, టైటిల్‌ను కూడా 'రాజధాని ఫైల్స్' అని మార్చాం. దీని వల్ల అదనంగా ఖర్చు అయి, బడ్జెట్ కూడా పెరిగింది' అని చెప్పారు దర్శకుడు భాను. ఆయన రూపొందించిన 'రాజధాని ఫైల్స్' చిత్రం గురువారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా మీడియాతో ముచ్చటించారు.

● 'ఇది రాజకీయ చిత్రం కాదు.. ప్రజల సినిమా. ప్రజల ఆవేదనను చూపించే ప్రయత్నం చేశాం. ప్రజలు ఒక ప్రభుత్వాన్ని నమ్మి తమ భూములు ఇచ్చారు. మరో ప్రభుత్వం వచ్చి వారిపై ఆంక్షలు విధిస్తూ ఇబ్బంది పెడుతోంది. ప్రజలు నమ్మింది ప్రభుత్వాన్ని కానీ పార్టీలను కాదు. ఈ అంశాన్నే సినిమాలో చూపించాం' అని స్పష్టం చేశారు భాను.

● చిత్రీకరణ సమయంలో ప్రభుత్వ పరంగా ఎటువంటి ఒత్తిళ్లు రాలేదని చెబుతూ 'అమరావతికి వెళ్లి అక్కడి బాధిత రైతులతో ఈ సినిమా చేశాం. వాస్తవ సంఘటన ఆధారంగా సినిమా తీస్తున్నప్పుడు ఆ సంఘటనను ఎదుర్కొన్న వారే అందులో నటించడం చాలా అరుదు. మా సినిమాలో బాధితులే తమ పాత్రలను పోషించారు' అని ఆయన తెలిపారు. సినిమాలో రైతు ప్రతినిధిగా వినోద్‌కుమార్, రైతు భార్యగా వాణీ విశ్వనాథ్ నటించారనీ, మణిశర్మ అద్భుతమైన సంగీతాన్ని అందించారనీ దర్శకుడు భాను తెలిపారు.

వినోదం.. అంతకుమించి



సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన 'డీజే టిల్లు' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందిన 'టిల్లు స్క్వేర్' విడుదల కోసం తుది మెరుగులు దిద్దుకుంటోంది. అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటిస్తున్నారు. మల్లిక్ రామ్ దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని శ్రీరాములు థియేటర్‌లో 'టిల్లు స్క్వేర్' ట్రైలర్‌ను విడుదల చేశారు. మొదటి భాగంలో రాధికతో ప్రేమ కారణంగా ఇబ్బందులు తెచ్చుకున్న టిల్లు ఇప్పుడు మరోసారి అదే తరహాలో సమస్యల సమూహంలో చిక్కుకున్నట్లు ట్రైలర్‌లో చూపించారు. అనుపమ లుక్స్‌తో పాటు ఆమె బాడీ లాంగ్వేజ్, సిద్ధుతో ఆమె కెమిస్ట్రీ ఈ ట్రైలర్‌లో హైలైట్‌గా నిలిచాయి.

రక్షిత్ అట్లూరి, కోమలి జంటగా నటించిన గ్రామీణ ప్రేమ కథా చిత్రం 'శశివదనే'. సాయి మోహన్ ఉబ్బన దర్శకత్వంలో అహితేజ్ బెల్లంకొండ నిర్మించారు. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. ఏప్రిల్ 5న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు మేకర్స్

వేసవిలో శశివదనే



బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో ప్రేమికులుగా రక్షిత్, కోమలి జంట ఆకట్టుకుంది. 'మనసులో పుట్టే ప్రేమ మచ్చలేనిదైతే ఆ ప్రేమకు మరణం కూడా మనతోనే' అనే డైలాగ్ ఆ పోస్టర్‌కు ప్రత్యేకాకర్షణగా నిలిచింది. ఈ చిత్రానికి సంగీతం: శరవణ వాసుదేవన్. సినిమాటోగ్రఫీ: శ్రీ సాయికుమార్ దారా

అన్నీ డబుల్ ఉంటాయి



ప్రియమణి ప్రధాన పాత్ర పోషించిన 'భామాకలాపం 2' వెబ్ సిరీస్ ఈ నెల 16 నుంచి ఆహాలో స్ట్రీమింగ్ కానుంది. సీరత్ కపూర్, శరణ్య, రఘు ముఖర్జీ, బ్రహ్మాజీ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. అభిమన్యు తడిమేటి దర్శకత్వం వహించిన ఈ సిరీస్‌ను బాపినీడు, సుధీర ఈదర నిర్మించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన ప్రెస్‌మీట్‌లో ప్రియమణి మాట్లాడుతూ 'ఇందులో అన్నీ డబుల్ ఉంటాయి. థ్రిల్స్, ట్విస్టులతో పాటు కాస్త డేంజర్ కూడా ఉంది. ప్రతి పాత్రకూ ప్రాధాన్యం ఉంది. మహిళ తలుచుకుంటే ఏదైనా చేయగలదు అని చెబుతున్నాం' అన్నారు. మొదటి పార్ట్ చూసి రెండో పార్ట్ చూస్తే ఇంకా ఎక్కువగా కనెక్ట్ అవుతారని దర్శకుడు అభిమన్యు చెప్పారు. ఇందులో తనకు జుబేదా పాత్ర ఇచ్చిన దర్శకుడికి సీరత్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సిరీస్ కోసం ఎంతో కష్టపడ్డామని మరో నటి శరణ్య చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆహా బిజినెస్ హెడ్ వాసు, ఎడిటర్ విప్లవ్ కూడా పాల్గొన్నారు.

అమ్మాయిలు ఇచ్చే షాక్.. అదే మెడిసిన్!



ఒక తెలుగు యువతి హీరోయిన్‌గా నటించడం, ఆ సినిమాకు ఆమె కథకురాలు, నిర్మాత కావడం అరుదు. 'డియర్ ఉమ' చిత్రంతో సుమయ రెడ్డి ఇలా తన బహుముఖ ప్రజ్ఞ ప్రదర్శిస్తున్నారు. పృథ్వీ అంబర్ ఈ సినిమాలో హీరోగా నటిస్తున్నారు. సాయి రాజేశ్ మహాదేవ్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా 'డియర్ ఉమ' చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. ఇదొక ప్రేమ కావ్యం అని టీజర్ చూశాక అనిపించింది. 'అబ్బాయిల ప్రేమలో స్వార్థం ఉండదు. అమ్మాయిల స్వార్థంలోనే ప్రేమ ఉంటుంది. అమ్మాయిలు ఇచ్చే షాకులకు అబ్బాయిలకు ఇదే సరైన మెడిసిన్' వంటి డైలాగులు సినిమాలో డెప్త్‌ను చాటాయి.



8 వసంతాల ప్రేమ

'మధురం' ఫేం ఫణీంద్ర నర్సెట్టి దర్శకుడిగా ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ కొత్త చిత్రం ప్రకటించింది. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా టైటిల్‌ను ప్రకటించారు. ఎనిమిది సంవత్సరాలలో ఓ అందమైన యువతి జీవితంలో జరిగిన సంఘటనల సమాహారంగా ఈ చిత్రం తెరకెక్కుతోందని నిర్మాతలు నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ తెలిపారు. దీనికి '8 వసంతాలు' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని నిర్మాతలు చెప్పారు.

కాలం రాసిన ఆరు కథలు



సాగర్, వికాస్, అభిలాష్ ముఖ్య పాత్రలు పోషించిన చిత్రం 'కాలం రాసిన కథలు'. ఎం.ఎన్.వి. సాగర్ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం టీజర్‌ను బుధవారం పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శ్రీధర్ విడుదల చేశారు. ఫ్యామిలీ, లవ్, సస్పెన్స్ జానర్‌లో ఈ చిత్రం రూపొందడం విశేషం. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ 'ప్రతి ఒక్కరి జీవితంలోనూ కాలం కొన్ని కథలు రాస్తుంది. మనం ఏదో అవుదామని వస్తే మరేదో అవుతాం. దానిని బట్టే జర్నీ ఉంటుంది. దర్శకుడు సాగర్ ఈ చిత్రానికి మంచి టైటిల్ ఎన్నుకోవడంలోనే సగం విజయం సాధించారు. పలు కథలను కలిపి సినిమా తీయడం అభినందనీయం' అన్నారు.

తండ్రీ కొడుకుల కథ



నటుడు ధన్‌రాజ్ దర్శకత్వంలో సముద్రఖని ముఖ్యపాత్రలో నటిస్తున్న ద్విభాషా చిత్రం 'రామం రాఘవం'. తండ్రీ కొడుకుల అనుబంధం నేపథ్యంలో తెరకెక్కుతోంది. ప్రభాకర్ ఆరిపాక సమర్పణలో పృథ్వీ నిర్మిస్తున్నారు. ప్రేమికుల రోజు సందర్భంగా 'రామం రాఘవం' చిత్రం గ్లింప్స్‌ను హీరో రామ్ పోతినేని, దర్శకుడు హరీష్ శంకర్ విడుదల చేశారు. ఈ చిత్రంలో శ్రీనివాసరెడ్డి, చిత్రం శ్రీను కీలకపాత్రలు పోషిస్తున్నారు. శివ ప్రసాద్ యానాల కథను సమకూర్చగా, అరుణ్ చిలువేరు సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: మార్తాండ్ కే వెంకటేశ్

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Kdplrv5 లో చదవండి.



ముప్పాళ్ళలో టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కన్నాలక్ష్మీనారాయణ

జగన్ అండ్ కో ఓ దొంగల ముఠా

- ప్రజలను ఓట్లు అడిగే హక్కే లేదు వారికి లేదు
- టీడీపీ సత్తెనపల్లి నియోజకవర్గ అభ్యర్థి కన్నా లక్ష్మినారాయణ

ముప్పాళ్ళ ఫిబ్రవరి 14: సంక్షేమం పేరుతో రాష్ట్ర సంపదను దోచుకున్న జగన్ అండ్ కో ఓ దొంగల ముఠా పార్టీ అనీ, వారికి ప్రజలను ఓట్లు అడిగే హక్కే లేదని మాజీ మంత్రి, టీడీపీ సత్తెనపల్లి అభ్యర్థి కన్నా లక్ష్మినారాయణ అన్నారు. బుధవారం మండల కేంద్రం ముప్పాళ్ళలో టీడీపీ కార్యాలయాన్ని కన్నా ప్రారంభించారు. అనంతరం కన్నా విలేకరులతో మాట్లాడుతూ.. 'సైకోను తరిమేద్దాం..' అన్న నినాదంతో ప్రజలు ఎన్నికల సమరానికి సంసిద్ధంగా ఉన్నారని అన్నారు. జగన్‌రెడ్డి సంక్షేమం పేరుతో రాష్ట్ర సంపదను దోచుకున్నారనీ, ప్రజలకు రూ.10 ఇచ్చి వారి వద్ద నుంచి రూ.1000 నొక్కేశాడని అన్నారు. తన అనుచరుల కంపెనీలలో నాసిరకం మద్యం తయారు చేయించి, ప్రభుత్వమే అమ్ముతూ పేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాడని దుయ్యబట్టారు. సామాన్య ప్రజలపై అన్ని రకాల ధరల పెనుభారాలను మోపిన విషయాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, రానున్న ఎన్నికలలో వైసీపీకి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఒక్కసారి అవకాశం ఇచ్చినందుకు జగన్‌రెడ్డి అక్రమ సంపాదనలో ఎవరెస్టు ఎత్తును అధిగమించాడని, ఈ సారి అవకాశమిస్తే సర్వం దోచేస్తాడని అన్నారు. కార్యక్రమంలో గుంటూరు నగర మాజీ మేయర్ కన్నా నాగరాజు, మండల టీడీపీ అధ్యక్షులు బత్తుల నాగేశ్వరావు, మండల టీడీపీ పరిశీలకుడు ఆళ్ళ సాంబయ్య, రావిపాటి మధుబాబు, సర్పంచ్‌లు యలమందరావు, చంద్ర శేఖర్, నేతలు పలువురు పాల్గొన్నారు.

బాండ్ల ప్రకారం బీమా మొత్తాన్ని చెల్లిస్తాం

- శుభం కోల్డ్ స్టోరేజీ యజమాని శ్యాంకుమార్

దుగ్గిరాల, ఫిబ్రవరి 14: కోల్డ్ స్టోరేజీలో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన రైతులకు వారిసరుకు నిల్వపత్రాల వివరాల ప్రకారం బీమా మొత్తం చెల్లిస్తామని శుభంమహేశ్వరి కోల్డ్‌స్టోరేజీ యజమాని శ్యాంకుమార్ తెలిపారు. దుగ్గిరాలలో గత నెల 19న జరిగిన అగ్నిప్రమాదంలో 1లక్షా 16వేల బస్తాల పసుపు దగ్ధమైన విషయంవిదితమే. కాగా శ్యాంకుమార్‌కు కాలిన గాయాలతో ఆసుపత్రి పాలై, చికిత్స అనంతరం బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అగ్నిప్రమాదం దురదృష్టకరమని, తమ వద్ద సరుకు నిల్వపెట్టుకున్న సమయంలో రైతులకు యిచ్చిన అంగీకార పత్రాల ఆధారంలో బీమా మొత్తాన్ని ఆయా కంపెనీల నుంచి వచ్చిన వెంటనే వారికి అందజేస్తామన్నారు. సుమారు 600 మంది వరకూ రైతులు సుమారు రూ.40 కోట్ల విలువగల పసుపు తమ కోల్డు స్టోరేజీలో నిల్వ పెట్టుకున్నారన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖ, రెవెన్యూ అధికారులు పరిశీలించారని, డ్రోన్ కెమెరాల సాయంతో వీడియోలు కూడా తీసి, పూర్తిస్థాయిలో విచారణ జరిపారని, రికార్డులను అధికారులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. బీమా మొత్తంపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని శ్యామ్‌కుమార్ అల్లుడు విజయకృష్ణ తెలిపారు.

మిర్చి రైతు.. ఉసూరు

- మిర్చి అమ్మాక మిగిలింది కన్నీరే
- క్వింటాలుకు రూ.15 వేలు పడటం గగనమే
- పలుకుతున్న ధరకు.. పెట్టుబడికి మధ్య తీవ్ర అగాధం
- సరుకు దించేసి కూలీ పనులకు వెళుతున్న కర్నూలు రైతులు
- ఇంటికి వెళ్తే అప్పులిచ్చినోళ్ళకి మొఖం చూపలేమని ఆవేదన



గుంటూరు సిటీ, ఫిబ్రవరి 14: పంట అమ్ముకున్నాక జేబు నిండా సొమ్ము.. ముఖం నిండా నవ్వుతో రైతులు ఇంటి బాట పట్టేవారు. ఇప్పుడు మిర్చి అమ్ముకుంటున్న రైతులు కళ్ళనిండా నీళ్ళు.. గుండెనిండా బాధతో వెనుతిరుగుతున్నారు. పెట్టిన పెట్టుబడికి.. పలుకుతున్న మిర్చి ధరకు మధ్య తీవ్ర అగాధం ఏర్పడుతుండగా అన్నదాతలు దిగాలు చెందుతున్నారు. ఎన్నో ఆశలతో వందల కిలోమీటర్లు దాటి ఇక్కడ కు పంట తీసుకొస్తున్న మిర్చిరైతులు ధరలు చూసి నీరుగారి పోతున్నారు. తెలంగాణ, కర్నూలు రైతుల దుస్థితి మరీ దారుణంగా ఉంది. పంట అమ్మగా పెట్టుబడిలో సగభాగం సొమ్ము కూడా రాకపోతుండటంతో రాయలసీమ నుంచి వచ్చిన రైతులు కూలీ పనుల కోసం ఇక్కడే ఆగిపోతున్నారు.

పొంతనే లేదు.. ఈ ఏడాది మిర్చి పంట సాగుచేసిన రైతులకు విచిత్ర పరిస్థితి ఎదురైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ధర పతనం అయింది. ఒక్కో రైతు ఎకరా మిర్చి సాగుకు రూ.2 లక్షల వరకు ఖర్చు చేశారు. మధ్యలో వచ్చిన తుఫాను ప్రభావంతో పంట పూర్తిగా దెబ్బతింది. ఆ తరువాత తెగుళ్ల దాడి కూడా ఆరంభమైంది. దిగుబడి పూర్తిగా పడిపోయింది. తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల్లో ఎకరాకు 7 క్వింటాళ్ల నుంచి 10 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. స్థానికంగా పంటను చాలా తక్కువ ధరకు అడుగుతుండటంతో ఎన్నో వ్యయప్రయాసలకు కోర్చి గుంటూరు యార్డు తీసుకొస్తున్నారు. తీరా ఇక్కడకు వచ్చాక గుండెల్లో రాయి పడుతుందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం యార్డులో క్వింటాలు రూ.13 వేల నుంచి రూ.15 వేల వరకు కొంటున్నారని అంటున్నారు. ఈ ధరకు అమ్మితే పెట్టుబడి సగానికి సగం కూడా రాదని ఆవేదన చెందుతున్నారు. ఇక్కడి యార్డులో క్వింటాలు కనీసం రూ.18 వేల నుంచి రూ.20 వేలన్నా పడుతుందన్న ఆశతో వస్తే వ్యాపారులు పూర్తిగా తమను ముంచేస్తున్నారని చెబుతున్నారు. కొద్ది సొమ్ముతో ఇళ్లకువెళ్లి అప్పులిచ్చిన వాళ్ళకి మొఖం ఎలా చూపించాలో అర్థం కావటం లేదని రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.

ముందు ఒక రేటు.. తరువాత ఒక రేటు

- ప్రభాకర్, ఎమ్మిగనూరు, కర్నూలు జిల్లా



ఎకరాకి పెట్టుబడి రూ.2 లక్షలు అయింది. దిగుబడి కూడా చాలా తక్కువ వచ్చింది. గుంటూరు యార్డుకు వస్తే మంచి రేటు వస్తుందనుకుంటే ఇక్కడ వ్యాపారులు బాగా మోసం చేస్తున్నారు. ముందు ఒక రేటు చెప్పి మచ్చుకాయలు తీస్తున్నారు. తర్వాత వచ్చి కాయలు మెత్తగా ఉన్నాయి.. బాగా లేదు అని రేటు తగ్గించేస్తున్నారు. మేము పూర్తిగా నష్టం పోయాం.

ఇళ్లకు లేదు.. కూలీ పనులకే..

- దేవదాసు, గంగవరం, కర్నూలు జిల్లా



నాకు ఎకరాకు 5 క్వింటాలు దిగుబడి వచ్చింది. చాలా నష్టం వచ్చింది. ఇక్కడ వచ్చే డబ్బులు తీసుకుని ఇంటికి వెళ్తే షావుకారు బతకనియ్యడు. మా వాళ్ళంతా ఇటునుంచి ఇటే కూలీ పనులకు వెళ్తున్నారు. కూలీ చేసి అప్పులు తీర్చాల్సిందే.

చావే శరణ్యం..

- దేవరాజు, ఎమ్మిగనూరు, కర్నూలు జిల్లా



నేను రెండు ఎకరాల్లో మిర్చి సాగుచేశాను. మొత్తం కౌలు పొలమే. రూ.4 లక్షలు దాకా అప్పు అయ్యింది. పంట అంతా అమ్మినా రూ.80 వేలు కూడా రాలేదు. వాటిని ఎవరికని కట్టాలి. ఇంటికి పోతే అప్పులోళ్లు బతకనీయరు. చావు తప్ప వేరే శరణ్యం లేదు.

ఇక్కడ అంతా మోసమే..

- దినేష్, గంగవరం, కర్నూలు జిల్లా



ఎక్కడ నుంచో పంట తీసుకుని వస్తే ఇక్కడ అంతా మోసం తప్ప ఏమీ లేదు. మూడు రోజులుగా అల్లాడుతున్నాము. అయినా పట్టించుకున్న నాథుడు లేడు. రేట్ రోజు రోజుకి తగ్గిస్తున్నారు. రూ.15 వేలు పడాలంటే దేవుడు కనిపిస్తున్నాడు.

రూ.25 వేలు పడితేనే గిట్టుబాటు..

- తిమ్మన్న, అమరావై, జోగులాంబ గద్వాల్ జిల్లా



మేము పెట్టిన పెట్టుబడికి పడుతున్న రేటుకి సంబంధం లేదు. మాకు దిగుబడి అసలు లేదు. తెగుళ్ల వల్ల చాలా నష్టపోయాము. ఇక్కడకు వస్తే ధర వస్తది అని వస్తే ఇక్కడ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. వ్యాపారులు కుమ్మక్కు అయ్యారు. రేట్ బాగా తగ్గిస్తున్నారు. మిర్చి క్వింటాలుకు రూ.25 వేలు అన్నా పడితేనే మేము కోలుకుంటాము.

ఏడుస్తూ పోతున్నాము..

- చంద్రన్న, అమరావై, జోగులాంబ గద్వాల్ జిల్లా



మిర్చి రైతులు అందరూ సరైన ధర రాక బాధలో ఉన్నారు. మాకు దిగుబడి పూర్తిగా పడిపోయింది. అంత పంట అమ్మితే చాలా తక్కువ డబ్బు వస్తుంది. ఇక్కడనుంచి వెళ్లేటప్పుడు ఏడుస్తూ పోతున్నాము.



మందడం రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న రైతులు

మూడు ముక్కలాట ముగిసిపోయింది

- హైద్రాబాద్ ఉమ్మడి రాజధాని అని జగన్‌రెడ్డి మరో నాటకం
- అమరావతే రాష్ట్ర ఏకైక రాజధాని.. మార్పు చేస్తే సహించేది లేదు
- 1520వ రోజుకు చేరుకున్న రైతులు

తుళ్ళూరు; ఫిబ్రవరి 14: వైసీపీ ప్రభుత్వం ఆడుతున్న మూడు రాజధానుల మూడుముక్కల ఆట ముగిసిపోయిందని, ఇప్పుడు ఉమ్మడి రాజధాని హైద్రాబాద్ అని సీఎం జగన్‌రెడ్డి మరో నాటకానికి తెరలేపాడని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతుకూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు బుధవారం నాటికి 1520వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నాశిబిరాల నుండి వారు మాట్లాడుతూ విశాఖపట్నంలో వైసీపీ నేతలు కారుచౌకగా కొన్న భూముల విలువను భారీగా పెంచుకోవటానికి అమరావతిని నిర్వీర్యం చేసి విశాఖ రాజధాని అంటూ ఊదరగొట్టారన్నారు. కానీ ఇప్పటికైనా, ఎప్పటికైనా అమరావతే రాష్ట్ర ఏకైక రాజధానిగా ఉంటుందన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలతో పాటు మంగళగిరి, తాడకొండ నియోజకవర్గాలలో ఆందోళనలు కొనసాగాయి.



సమావేశం నిర్వహిస్తున్న సీడబ్ల్యూసీ డైరెక్టర్ రమేష్‌కుమార్

ఎన్‌డీఎస్‌ఏ బృందం సాగర్ ప్రాజెక్టు సందర్శన

- విద్యుత్ ఉత్పాదక కేంద్రాల పరిశీలన.. వివరాల సేకరణ

విజయపురిసౌత్, ఫిబ్రవరి 15: సాగర్ ప్రాజెక్ట్ దిగువనున్న జల విద్యుత్ ఉత్పాదక కేంద్రాలను బుధవారం ఎన్‌డీఎస్‌ఏ (నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ) బృందం సందర్శించింది. జలాశయంలో పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పాదన వివరాలను, టర్బైన్లలో వచ్చే సాంకేతి సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను, కుడి కాల్వ హెడ్ రెగ్యులేటర్ నుంచి నీరు విడుదలయ్యే తీరు, వాటిని విద్యుత్ ఉత్పాదక కేంద్రంలోకి మళ్లించే తీరును జెన్‌కో అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా విజయవిహార్ బోర్డు రూమ్‌లో సీడబ్ల్యూసీ డైరెక్టర్ రమేష్‌కుమార్ జెన్‌కో అధికారులతో సమావేశమయ్యారు. ప్రాజెక్ట్ నీటి నిల్వ సామర్థ్యం, భద్రత, నీటి వినియోగం, విద్యుత్ ఉత్పత్తి తదితర వాటిపై జెన్‌కో సీఈ మంగేష్‌కుమార్ నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఎన్‌డీఎస్‌ఏ బృందంలో డైరెక్టర్ ఆశిష్‌కుమార్, మహేంద్రసింగ్, డిప్యూటి డైరెక్టర్ మహ్మద్‌జిషన్, సాంకేతిక నిపుణుడు రాకేష్, ఇంజనీర్ కుమార్, ఎస్ఈ మురళీకృష్ణ, ఆర్గనైజేషన్ సీఈ ప్రమీల, ఎస్ఈ శ్రీనివాసులు, ఈఈ విజయలక్ష్మి, డీఈ సతీష్, సాగర్ సీఈ మురళీధరరెడ్డి, కృష్ణా రివర్ బోర్డు ఎస్ఈ వరలక్ష్మిదేవి, ఈఈ శ్రీహరి, తెలంగాణ సీఈ విజయకుమార్, ఎస్ఈ నాగేశ్వరరావు, ఈఈ మల్లికార్జునరావు తదితరులు ఉన్నారు.



తులసీ ధర్మచరణ్‌ను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు, వేద సీడ్స్ సిబ్బంది

ఘనంగా తులసీ ధర్మచరణ్ జన్మదిన వేడుకలు

- వివిధ ప్రాంతాల్లో అన్నదానాలు, సేవా కార్యక్రమాల నిర్వహణ

గుంటూరు, ఫిబ్రవరి 14: వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసీ ధర్మచరణ్ జన్మదిన వేడుకలు గుంటూరు నగరంలోని వేద సీడ్స్ కార్యాలయంలో బుధవారం ఘనంగా జరిగాయి. వేద సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పీ.చంద్రశేఖర్, పలువురు సిబ్బంది, అభిమానుల సమక్షంలో ధర్మచరణ్ కేక్ కట్ చేశారు. ఎండీ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కష్టం, స్వయంకృషికి మారుపేరు ధర్మచరణ్ అని, పట్టుదలే ఆయన విజయరహస్యమని, చిన్న వయస్సు నుంచే సేవని ఇంటి పేరుగా మార్చుకొని, ఎంతో మంది పేద విద్యార్థులకు, క్రీడాకారులకు ఆర్థికంగా వెన్నంటే ఉంటున్నారన్నారు. భవిష్యత్‌లో ప్రత్యక్ష రాజకీయాల ద్వారా తన దైనశైలిలో ప్రజా సమస్యలపై పోరాడి ప్రజలకు మరింత చేరువ కావాలని కోరారు. అనంతరం ఆశ్రమ పాఠశాలలో, వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ధర్మచరణ్ సన్నిహితులు, హోటల్ సుభాని నిర్వాహకులు తాడి శ్రీనివాస్, తిమ్మిశెట్టి కళ్యాణ్ ఆధ్వర్యంలో పెదకాకాని మండలం భ్రమ రాంబపురం కాలనీలో లిమాహోమ్ ఆశ్రమ పాఠశాలలోని చిన్నారులకు, రెడ్డిపాలెం మానవతా వృద్ధాశ్రమంలో డొంకెన మురళీకృష్ణ, ఆర్ఆర్‌కే క్యాటర్స్ అధినేత రేజేటి రామకృష్ణ ఆధ్వర్యంలో, నల్లచెరువులోని నిరాశ్రయులకు అన్నదానం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ధర్మచరణ్ మాట్లాడుతూ.. తానెప్పుడు మెగాస్టార్ చిరంజీవి, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు విధేయుడుగా ఉంటానని, వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని తనను దిశానిర్దేశం చేస్తే ఖచ్చితంగా గెలిచి చూపిస్తానని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చిట్టిం లక్ష్మణ్, డాక్టర్ కంతా జగదీష్, సుంకర సతీష్, చెన్నంశెట్టి శివ, ఎంఎస్ఆర్ ఆంజనేయులు, కన్నసాని బాజీ, యర్రబోతు వాసు, కన్నెగంటి బాలు, కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ, రేజేటి రామకృష్ణ, తన్నీరు శివశంకర్, వీరిశెట్టి సుబ్బారావు, గుర్రాల రంగారావు, గణేష్, చందు, శ్రీనివాసరావు, సతీష్, సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి

- ప్రయాణంలో ఫిట్స్ వచ్చి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని ప్రమాదం

తెనాలి రూరల్, ఫిబ్రవరి 14: తెనాలి మండలంలోని కంచెర్లపాలెం సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తెనాలి పట్టణం చెంచుపేటకు చెందిన నగేష్(48) ఆటోనగర్ నుండి కంచర్లపాలెం వైపు ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. మార్గ మధ్యలో అతడికి ఫిట్స్ రావడంతో వాహనం అదుపుతప్పి కరెంట్ పోల్‌ను ఢీకొంది. కిందపడిపోయిన నగేష్ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు తెనాలిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా మృతి చెందాడు. మృతిడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. టీడీపీ సానుభూతి పరుడుగా మంచి గుర్తింపు ఉన్న నగేష్ మృతి చెందాడన్న వార్త తెలుసుకుని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పార్టీ శ్రేణులు నగేష్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలతో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

ప్రభుత్వ ఉద్యోగుల పరిస్థితి దయనీయం



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఘంటసాల శ్రీనివాసరావు, ఉద్యోగులు

- జిల్లా ఏపీ జేఏసీ చైర్మన్ ఘంటసాల శ్రీనివాసరావు
- నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు
- బకాయిలువిడుదల చేయాలని కలెక్టరుకు వినతి

గుంటూరు, ఫిబ్రవరి14: ఉద్యోగుల ఆర్థిక పరిస్థితి రోజురోజుకి దిగజారుతుందని, స్కూలు, కాలేజీ ఫీజులు కూడా చెల్లించలేని పరిస్థితులలో ఉన్నారని, తక్షణం ప్రభుత్వం స్పందించి ఉద్యోగులకు రావాల్సిన రూ.21 వేల కోట్ల బకాయిలను చెల్లించాలని గుంటూరుజిల్లా ఏపీ జేఏసీ చైర్మన్ ఘంటసాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా బుధవారం ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలను ధరించి విధులకు హాజరయ్యారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగులతో కఠినంగా వ్యవహరిస్తుందని, ఉద్యోగ సంఘాలతో అనేకసార్లు మంత్రుల కమిటీ చర్చలు జరిపారని, వాయిదాల పద్ధతిలో ఉద్యోగులకు ఇవ్వవలసిన బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ ఏది ఇంతవరకు చెల్లించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. 12వ పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేసినప్పటికి ఇంతవరకు సిబ్బందిని నియమించలేదన్నారు. కార్యాచరణలో భాగంగా గురువారం, శుక్రవారం రెండు రోజుల పాటు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసనలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ జేఏసీ జిల్లా కన్వీనర్ శెట్టిపల్లి సతీష్‌కుమార్, నేతలు ఏ.శ్యాం సుందర్, కే.శ్రీనివాసరావు, కే.శివజ్యోతి, సూరి, సీహెచ్ కళ్యాణ్‌కుమార్, శ్రీనివాసరావు, విజయ లక్ష్మీ, పెన్షనర్స్ అసోసియేషన్, ఏపీటీఎఫ్, ఖజానా శాఖ అధ్యక్షుడు కే.నరసింహారెడ్డి, బసవలింగరావు, అలీ, ఆంజనేయలు పాల్గొన్నారు.



నరేంద్ర కుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన నిడుబ్రోలు వైసీపీ నాయకులు

అరాచక వైసీపీని ఇంటికి సాగనంపుదాం

- మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి14: అరాచక పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపటానికి ప్రతి ఒక్కరు కలిసి రావాలని మాజీ ఎమ్మెల్యే సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని నిడుబ్రోలుకు చెందిన పలువురు వైసీపీ నేతలు టీడీపీలో చేరారు. మండల పరిధిలోని చింతలపూడి గ్రామంలో ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో వైసీపీ నేతలకు టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అణిచివేతకు గురయ్యాయారని, వారి ఓట్లతో అధికారంతోకి వచ్చిన జగన్‌రెడ్డి ఆ ప్రజలపైనే దారుణాలకు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. దళితులకు టీడీపీ ప్రభుత్వం అమలు చేసిన 27 సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. ఇలాంటి అవినీతి అరాచక ప్రభుత్వాని సాగనంపేందుకు ప్రతి ఒక్కరు టీడీపీ, జనసేన కూటమిని బలపరచాలని, నరేంద్ర కుమార్ విజ్ఞప్తి చేసారు. టీడీపీలో చేరిన వారిలో నిడుబ్రోలుకు చెందిన యాతాటి అవసంతరావు, మంద్రు సురేష్, పాములపాటి సురేష్, కర్ర సతీష్, రాత్రిక్రింద సురేష్, దూళ్ల లింకన్, భట్టు షరాక్, దొప్పలపూడి రాజ్‌కుమార్, పతెళ్ల నాగరాజు, యాతాటి శేషయ్య, కసుకుర్తి కోటేశ్వరరావు, నిమ్మగడ్డ రాము తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో నిడుబ్రోలు టీడీపీ అధ్యక్షుడు జాగర్లమూడి సుధీర్, గోగినేని రజినీ కుమార్ పాల్గొన్నారు



భవిష్యత్ గ్యారెంటీ ప్రచారంలో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

హైదరాబాద్ రాజధాని అంటూ మరో కుట్ర

- మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 14: ప్రజారాజధాని అమరావతిని పొట్టన పెట్టుకున్న వైసీపీ ప్రభుత్వం నేడు హైదరాబాద్ మన రాజధాని అంటూ కొత్త కుట్రలకు తెర లేపిందని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. చిలకలూరిపేట పట్టణంలోని మార్కెట్ ప్రాంతంలో బుధవారం టీడీపీ నేతలు 'బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్‌లోని వర్తకుల వద్దకు వెళ్ళి తెలుగుదేశం, జనసేన ఉమ్మడి ప్రభుత్వంలో అమలు చేయనున్న పథకాలను వివరించారు. పూలు, పండ్ల విక్రయ దారులతో మాట్లాడి వ్యాపారాలు ఎలా ఉన్నాయో ఆరా తీశారు. మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యాపారవర్గాల వారితో పుల్లారావు మాట్లాడుతూ.. రాష్ట్ర భవిష్యత్ కోసం 33 వేల ఎకరాలు ఇచ్చిన రైతుల త్యాగాలకు పాతరేసిన జగన్‌రెడ్డి ఇప్పుడు హైదరాబాద్‌ను రాజధానిగా కొనసాగించాలంటూ కొత్త పల్లవి అందుకోవటం అనేక అనుమానాలకు తావిస్తుందన్నారు. స్థానిక కూరగాయాల మార్కెట్‌కు స్వాతంత్ర్య సమరయోధులు చంద్రమౌళి పేరును తొలగించి వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు పెట్టారని, టీడీపీ ప్రభుత్వం రాగానే చంద్రమౌళి పేరును పునరుద్ధరించి శాశ్వితంగా ఉండేలా చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజక వర్గ సమన్వయ కర్త తోట రాజా రమేష్, తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

బాపట్లలో అరుదైన 'పునుగుపిల్లి'



పునుగు పిల్లి

బాపట్ల, ఫిబ్రవరి 14 : అరుదైన పునుగుపిల్లి బాపట్ల పట్టణంలో కనిపించింది. పటేల్‌నగర్ 2వ లైన్‌లో గోరంట్ల శ్రీనివాసరావు గృహంలోని నీటిబావిలో పడింది. బుధవారం బావిలో దానిని చూచిన శ్రీనివాసరావు బక్కెట్‌తో బయటకు తీశాడు. చూడటానికి వింత ఆకారంలో ఉన్న దానిని ముంగిస జాతిలోని జీవి అని భావించాడు. తోక పొడవుగా నక్కతోకలాఉంది. దీంతో దాని గురించి అటవీశాఖ ముత్తాయపాలెం బీట్ ఆఫీసర్ పీ.శ్రీనివాసరావుకు తెలియజేశారు. ఆయన వచ్చి చూచి మొదట్లో ఏదో వింతజీవి అనుకొని తర్వాత గూగుల్‌లో చెక్ చేసి దానిని పునుగు పిల్లిగా పేర్కొన్నారు. అంతరించిపోతున్న పునుగుపిల్లిలు కనిపించటంలేదని, అరుదుగా ఉంటున్న ఇది పట్టణ నడిబొడ్డుకు ఎలా వచ్చిందో అర్థం కావటంలేదన్నారు. నీటిలో తడిచిన పునుగుపిల్లి మొదట కదలకుండా మెదలకుండా ఉండి, ఫారెస్ట్ అధికారులు పట్టుకోవటానికి ప్రయత్నించగా దానిని పట్టుకునేందుకు ఫారెస్ట్ సిబ్బంది నానా తిప్పలు పడ్డారు. చివరకు పట్టుకొని దానిని సూర్యలంక ఎయిర్‌ఫోర్స్‌స్టేషన్ ఫారెస్ట్‌లో వదిలిపెడుతామని బీట్ ఆఫీసర్ శ్రీనివాసరావు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.36
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్


బ్రాయిలర్ బర్డ్	138, 147,158
చికెన్ విత్ స్కిన్	264.00
చికెన్ స్కిన్ లెస్	274.00

1,16,434 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,04,737 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,16,434 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 90,110 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	20500
నెంబరు. 5	10000	21000
273	12000	17500
341	10500	21000
4884	14000	17500
సూపర్ 10	15000	15200
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	22000
బ్యాడిగి	9500	22000
దేవనూరు డీలక్స్	9500	21000
తెల్లకాయలు	5500	13000

ఎమ్మెల్యే శంకరరావు కుటుంబ సభ్యులకు రెండేసి ఓట్లు


75త్యాళ్లూరులో శంకరరావు కుటుంబ సభ్యుల ఓట్లు

పెదకూరపాడు, ఫిబ్రవరి 14 : సార్వత్రిక ఎన్నికలకు సిద్ధమైన ఓటర్ల తుది జాబితాలో పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కుటుంబ సభ్యులకు రెండు నియోజకవర్గాలలో ఓట్లు కలిగి ఉండటం అనుమానాలకు తావిస్తుంది. పోలింగ్ కేంద్రాల వారీగా మార్పులకు, చేర్పులకు అవకాశం కల్పించి పలుమార్లు బీఎల్‌వోల ద్వారా వినతులు స్వీకరించినప్పటికీ అధికార పార్టీకి చెందిన వారికి అవసరమైన చోట్ల ఓటు చేర్పడం రెండు ఓట్లు ఉన్నా తొలగించకపోవడం, ప్రతిపక్ష పార్టీల వారి ఓట్లను గ్రామంలో లేరనే సాకుతో ఉన్న ఒక్క ఓటును తొలగించడం పరిపాటిగా మారింది. పెదకూరపాడు మండలంలోని 75 త్యాళ్లూరు 194వ పోలింగ్ బూత్‌లో ఎమ్మెల్యే సోదరుడు నంబూరు రఘునాధరావు వరుస నెంబరు 580, తాడికొండ నియోజకవర్గంలోని తుళ్లూరు మండలం పెదపరిమిలో 435 నెంబరులో ఓట్లు ఉన్నాయి. చెల్లెలు భాష్యం పద్మావతికి త్యాళ్లూరులో 578, పెదపరిమిలో 417, బావ భాష్యం వీరాంజనేయులుకు త్యాళ్లూరులో 579, పెదపరిమిలో 414, అన్నకోడలు నంబూరు కల్పనకు త్యాళ్లూరులో 585, పెదపరిమిలో 439, అక్క పోతుగుంట్ల విజయలక్ష్మికి త్యాళ్లూరులో 583, పెదపరిమిలో 171, బావ పోతుగుంట్ల ఉమామహేశ్వరరావుకు త్యాళ్లూరులో 584, పెదపరిమిలో 170 నెంబర్లలో ఓట్లు ఉన్నాయి. వీరితో పాటు త్యాళ్లూరు గ్రామానికి సంబంధంలేని భాష్యం దివ్య, నంబూరు శ్రీదేవి, ఘట్టమనేని సూర్యప్రకాష్, తదితరులకు ఓట్లు ఉన్నాయి.

దొంగ ఓట్లు ఉంటే తొలగించి చేర్పులు, మార్పులు ఉంటే చేయించాలని ఎన్నికల సంఘం ఎన్నిసార్లు మొత్తుకున్న అధికారులకు చెవికెక్కడం లేదు. గ్రామ స్థాయిలో బూత్ స్థాయి అధికారులు అధికార పార్టీ నాయకులకు తొత్తులుగా మారి దొంగ ఓట్లపై దృష్టి సారించడం లేదు. అధికారం అడ్డు పెట్టుకుని నియోజకవర్గంలోని బెల్లంకొండ మండలంలో బడిపిల్లలకు ఓటు నమోదు చేయడం, పెదకూరపాడు మండలంలో కుటుంబ సభ్యులకు దొంగ ఓట్లు కల్పించడం చర్చనీయాంశమైంది. గతంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు దిగువ స్థాయి నాయకునితో మాట్లాడుతూ ఇతర పార్టీల వారు గ్రామంలో లేకపోతే ఓట్లు తీయించమని, మన పార్టీ వారైతే ఇతర ప్రాంతాలలో ఉన్నా ఓటు నమోదు చేయమనడం అప్పట్లో పెద్ద చర్చనీయాంశమైంది. అదే పద్ధతిలో సొంత కుటుంబ సభ్యులకు వైసీపీకి పట్టు ఉన్న 75 త్యాళ్లూరు గ్రామంలో ఓట్లు చేర్పించడం అధికార దాహానికి నిదర్శనమని చెప్పవచ్చు.


బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీలో పాల్గొన్న బ్రహ్మారెడ్డి తదితరులు

చంద్రబాబుతోనే భవిష్యత్ సాధ్యం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి

మాచర్ల, ఫిబ్రవరి 14: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్ సాధ్యపడుతుందని ఆ పార్టీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. పట్టణంలోని నెహ్రూనగర్‌లో బుధవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రాగా మార్చారన్నారు. ఉద్యోగులకు నెలవారీ వేతనాలను సక్రమంగా అందించలేని దుస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందన్నారు. టీడీపీ, జనసేన సానుభూతిపరులపై పోలీసులను అడ్డుపెట్టుకొని అక్రమ కేసులు బనాయించి వేధిస్తున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. రానున్న ఎన్నికల్లో ఈ సైకో జగన్‌ను ఇంటికి పంపి విజన్ ఉన్న నేత చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. టీడీపీ, జనసేన నేతలంతా కలిసికట్టుగా ఉంటూ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఇంటింటికి తిరిగి టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. అవ్వ, తాతలను ఆప్యాయంగా పలుకరిస్తూ పరామర్శిస్తూ ముందుకు సాగారు. నాలుగేళ్ల శాసనసభ్యునిగా ఉన్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమీ లేదని, తనకు ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చూపిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కొమెర దుర్గారావు, పంగులూరి అంజయ్య పాల్గొన్నారు.

సమ్మె కాలానికి జీవో ఇచ్చి అమలు చేయాలి : సీఐటీయూ

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 14 : మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలకు జీవో ఇచ్చి వెంటనే అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ నెల 20వ తేదీలోపు జీవోలు ఇచ్చి అమలు చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని సీఐటీయూ నాయకులు తెలగపల్లి శ్రీను హెచ్చరించారు. అనంతరం కమిషనర్ గిరికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ కార్మికులు సీతారామయ్య, కుంభా కొండలు, మార్తమ్మ, పద్మ, కుంభా వెంకటేశ్వర్లు, కాండ్రకుంట యలమంద, కంపా శ్రీను, సాగర్‌బాబు, గుంటి నాగేశ్వరరావు, సుజాత, పాలకుర్తి సురేంద్ర, మేరమ్మ పాల్గొన్నారు.

సంజీవయ్య చిత్రపటానికి నివాళి

మాచవరం, ఫిబ్రవరి 14 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మొట్టమొదటి దళిత ముఖ్యమంత్రి డాక్టర్ దామోదర సంజీవయ్య జయంతిని పురస్కరించుకొని మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి బుధవారం పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మీరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ వెలిశల అనిల్‌కుమార్, జిలుగు వెంకట నరసింహారెడ్డి, షేక్ అల్లాభక్షు, మండల కో-ఆప్షన్ సభ్యులు మహ్మద్ జాని, ఇన్‌చార్జ్ ఎంపీడీవో వెంగళరావు, ఏవో రామమ్మ, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రేపు శ్రీ భావనారుషి కల్యాణం

మాచవరం, ఫిబ్రవరి 14 : మాచవరంలో ఉన్న శ్రీ భద్రావతి సమేత భావనారుషి స్వామి కల్యాణ మహోత్సవం ఈ నెల 16వ తేదీన నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేయడం జరిగిందని, స్థానిక ప్రజలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు కల్యాణ మహోత్సవంలో పాల్గొనాలని కమిటీ వారు తెలిపారు. 17న అన్నసమారాధన నిర్వహించడం జరుగుతుందన్నారు.

19 నుంచి షటిల్ టోర్నమెంట్

మాచవరం, ఫిబ్రవరి 14 : మోర్జంపాడు లక్ష్మీనరసింహస్వామి 69వ కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 19వ తేదీ నుంచి షటిల్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని బుధవారం నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో ప్రథమ బహుమతి రూ.5 వేలు, రెండో బహుమతి రూ.4 వేలు, మూడో బహుమతి రూ.3 వేలు, నాల్గవ బహుమతి రూ.2 వేలు చొప్పున అందజేయడం జరుగుతుందన్నారు. వివరాలకు 8639770086 నెంబరును సంప్రదించాలని కోరారు.

వీఆర్‌కు దాచేపల్లి కానిస్టేబుల్

దాచేపల్లి, ఫిబ్రవరి 14 : దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వెంకట్ నాయక్‌ను జిల్లా పోలీసు అధికారులు వీఆర్‌కు పంపినట్లు స్థానిక ఎస్ఐ సంధ్యారాణి బుధవారం తెలిపారు. దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వెంకట్ నాయక్ కొద్దిరోజుల క్రితం ఓ చోరీ కేసులో పోలీసుల అదుపులో ఉన్న ముద్దాయి భార్యతో అసభ్యకరంగా ప్రవర్తించాడని, లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఆరోపణలు వెల్లువెత్తాయి. గురజాల మండలం జంగ మహేశ్వరపురం గ్రామానికి చెందిన త్రివేణి అనే మహిళ తనకు జరిగిన అన్యాయంపై న్యాయం చేయాలని కోరుతూ జిల్లా ఎస్పీ, గురజాల డీఎస్పీ, దాచేపల్లి సీఐలకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. గత రెండు రోజులుగా విచారణ జరిపి వెంకట్ నాయక్‌ను పోలీసు అధికారులు వీఆర్‌కు పంపారు.

కాపులకు అండగా ఉంటా

● టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వంతో మేలు

● మాజీ ఎమ్మెల్యే యరపతినేని


కాపు సామాజికవర్గ నేతలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 14 : రాష్ట్రంలో అరాచక పాలనను పోగొట్టేందుకు రానున్న ఎన్నికలలో టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రజాప్రభుత్వంతో అందరికీ మేలు జరుగుతుందనే భరోసా చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు ఇవ్వడం జరిగిందని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో బుధవారం జానపాడు గ్రామానికి చెందిన కాపు సామాజికవర్గ నేతలతో సమావేశం నిర్వహించారు. ఇక నుంచి కాపులకు ఏ అవసరమొచ్చినా నా ఇంటి తలుపు తట్టొచ్చని, వారందరికీ అండగా ఉండటంతో పాటు రేపటి ఎన్నికలలో గెలుపు తరువాత స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రాధాన్యత కల్పిస్తానన్నారు. గెలుపు కోసం కష్టపడి పని చేసిన వారందరినీ గుర్తించుకుంటూ వారికి పదవుల కేటాయింపులో ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఇప్పటి నుండే డోర్ టు డోర్ తిరుగుతూ టీడీపీ, జనసేన మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో కాపు సంఘం నేతలు యర్నాన రామకృష్ణ, పసుపులేటి నరసింహారావు, ఆకుల సుబ్బారావు, మన్నెం సుబ్బయ్య, మల్లెల శ్రీను, తోట రామదాసు, సూరం చెన్నయ్య, అబ్బిశెట్టి కోటి, బుంగా స్వామి, ఆవుల రమేష్, అంబటి సాయి, పలపాల నాగేశ్వరరావు, సూరం లక్ష్మయ్య, సూరం శ్రీను (యర్రశ్రీను) తదితరులు పాల్గొన్నారు.

నాగభూషణం చిత్రపటానికి నివాళి

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 14 : కొండమోడు పునరావాస కేంద్రంలో నివశిస్తున్న బెల్లంకొండ మండలం కోళ్లూరు మాజీ సర్పంచ్ మామిడి నాగభూషణం దశదిన కార్యక్రమానికి పార్టీ నేతలు పలువురు హాజరయ్యారు. గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ తనయుడు నాగరాజు, కొమ్మాలపాటి శ్రీధర్ వ్యక్తిగత కార్యదర్శి హాజరై నాగభూషణం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. తొలుత వీరవల్లి సుబ్బారావు, పద్మ కుమారుడు బాలనాగభరత్ కుమార్ వివాహానికి హాజరైన యరపతినేని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాలలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైస్తవుల ఉపవాస దినాలు ప్రారంభం

రెంటచింతల, ఫిబ్రవరి 14 : 40 రోజుల పాటు నియమ నిష్టలతో ఉండే క్రైస్తవుల ఉపవాస దినాలు బుధవారం నుంచి ఆరంభమైనట్లు ఆర్‌సీఎం చర్చి విచారణా గురువులు వైఎల్ మర్రెడ్డి చెప్పారు. దీక్ష చేపట్టిన 32 మందిని ఉద్దేశించి వైఎల్ మర్రెడ్డి మాట్లాడుతూ మోషే ప్రవక్త ఉపవాస దీక్షలు పాటించారన్నారు.

● అచ్చంపేట, ఫిబ్రవరి 14 : అచ్చంపేట మండలంలో బుధవారం క్రైస్తవులు ఉపవాస దీక్షలు చేపట్టారు. ఆర్‌సీఎం క్రైస్తవులు తాళ్ళచెరువులో 230 మంది, తాడువాయిలో 80 మంది దీక్షలు ప్రారంభించారు. తాళ్ళచెరువు విచారణ గురువు ఫాదర్ పుట్టి ఆంతోని రాజు ఆధ్వర్యంలో దీక్షలు కొనసాగనున్నాయి. సహాయక గురువు కిరణ్, పలువురు గురువులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే యర్రంకు సన్మానం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 14 : పట్టణంలోని బాప్టిస్ట్ చర్చి మూడవ వార్షికోత్సవం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డిని చర్చి పెద్దలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన చర్చి మూడవ వార్షికోత్సవాన్ని జరుపుకోవటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో చర్చి కమిటీ సభ్యులు గుజ్జర్లపూడి మార్పురావు, గుజ్జర్లపూడి సుందరరావు, స్కైలాబ్, ఇజ్రాయేలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్న సీఎం జగన్

● జనసేన ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి తవిటి

సత్తెనపల్లి, ఫిబ్రవరి 14 : సిద్ధం... అంటూ కోట్లాది రూపాయల ఖర్చుతో రాష్ట్రమంతా పెద్ద పోస్టర్లు వేయించుకొని సీఎం వైఎస్ జగన్ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నాడని జనసేన ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి తవిటి భవన్నారాయణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రజల్లోకి వస్తున్నాడనగానే అనుమతులు నిరాకరించి అడ్డుకోవటం ముఖ్యమంత్రి పిరికితనాన్ని తెలియజేస్తుందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా రానున్న ఎన్నికల్లో జనసేన, టీడీపీ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు తథ్యమన్నారు.

మండలాన్ని అభివృద్ధి పథంలో నడపాలి : పిన్నెల్లి

రెంటచింతల, ఫిబ్రవరి 14 : ఎంపీపీగా పాలనాపగ్గాలు చేపట్టిన పాముల సంపూర్ణమ్మ మండలాన్ని అభివృద్ధి పథంలో నడపాలని వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఆకాంక్షించారు. బుధవారం ఎంపీపీగా సంపూర్ణమ్మ చేత ఎంపీడీవో శంకరరావు పదవీస్వీకార ప్రమాణం చేయించారు. పిన్నెల్లి మాట్లాడుతూ ఇప్పటిదాకా ఎంపీపీగా వ్యవహరించిన చౌడేశ్వరీ సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ఎస్.నర్సిరెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ గొట్టం బ్రహ్మారెడ్డి, మాజీ కన్వీనర్ పూజల రామయ్య, సర్పంచ్ పేర్ల చౌడమ్మ, మాజీ జడ్పీటీసీ భాస్కరరెడ్డి, జిల్లా జేసీసీ కన్వీనర్ మోర్తల ఉమ, ఆదూరి ఇన్నారెడ్డి, ప్రతాపరెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైసీపీలో చేరిక

వెల్దుర్తి, ఫిబ్రవరి 14 : మండలంలోని శిరిగిరిపాడుకు చెందిన ఎస్సీ, ముదిరాజ్ సామాజిక వర్గీయులు బుధవారం ఆ పార్టీని వీడి వైసీపీలో చేరారు. మాచర్ల పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ప్రభుత్వ విప్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాచర్ల శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వీరికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గురుబ్రహ్మం, దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చింతా ఆదినారాయణ, తోట అంజి, వెంకటనారాయణ, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు విద్యార్థి రయ్యాన్‌కు ఇన్‌స్పైర్ మానక్ అవార్డు

క్రోసూరు, ఫిబ్రవరి 14 : క్రోసూరుకు చెందిన షేక్ రయ్యాన్‌కు ఇన్‌స్పైర్ మానక్ అవార్డు లభించింది. కలెక్టర్ శివశంకర్ చేతుల మీదుగా విద్యార్థి ఈ అవార్డును అందుకున్నారు. జిల్లా స్థాయిలో ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ఎగ్జిబిషన్‌లో విద్యార్థి తయారు చేసిన వీడింగ్ మిషన్ ఎస్‌ఐవీ ప్రదర్శించబడింది. రయ్యాన్ క్రోసూరు జై భారత్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. విద్యార్థికి అవార్డుతో పాటు మెరిట్ సర్టిఫికెట్ కూడా కలెక్టర్ అందించినట్టు పాఠశాల డైరెక్టర్ పీ.జయనేంద్రారెడ్డి తెలిపారు. విద్యార్థి రయ్యాన్‌ను ప్రధానోపాధ్యాయులు ఖాదిర్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ఇన్‌స్పైర్ మానక్ అవార్డుకు ఎంపికైన సంధ్య

కారంపూడి, ఫిబ్రవరి 14 : స్థానిక సెయింట్ జాన్స్ హైస్కూల్ విద్యార్థిని పార సంధ్య సైన్స్ ఇన్‌స్పైర్ మనక్ అవార్డుకు ఎంపికైంది. ఈ సందర్భంగా సంధ్యను స్కూల్ కరస్పాండెంట్ ఆంథోని బాల, ప్రిన్సిపాల్ కిరణ్‌జ్యోతి, ఉపాధ్యాయులు అభినందించారు.

గోశాలకు స్థలం కేటాయింపు

దాచేపల్లి, ఫిబ్రవరి 14 : దాచేపల్లిలోని మాతాపిత గోశాలకు స్థలాన్ని మంజూరు చేసినట్లు దాచేపల్లి తహసీల్దార్ వెంకటరమణ బుధవారం తెలిపారు. మాతా పిత గోశాలలో 70కి పైగా ఆవులు ఉన్నాయి. వీటికి సరైన స్థలం లేకపోవడంతో గోశాల నిర్వాహకులు పసుపులేటి పిచ్చయ్య, బత్తుల వెంకయ్య, గ్రామస్తులు కలిసి తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి స్పందించిన తహసీల్దార్ గోశాలను సందర్శించడమే కాకుండా స్థలాన్ని మంజూరు చేశారు.

భక్తిశ్రద్ధలతో శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణం

రెంటచింతల, ఫిబ్రవరి 14 : రెంటచింతలలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణాన్ని వేద మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా జరిపారు. భారీగా అన్నదానం చేశారు.

వాసవీక్లబ్ ఆధ్వర్యాన అక్షరాభ్యాసం

కారంపూడి, ఫిబ్రవరి 14 : కారంపూడిలోని బాలచంద్రనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం వసంత పంచమిని పురస్కరించుకొని వాసవీ క్లబ్ ఆధ్వర్యాన చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. పేటసన్నిగండ్ల ఎంపీటీసీ గాడిపర్తి పూర్ణయ్య రమాదేవి, చింతపల్లి మాజీ సర్పంచ్ ఉన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యాన విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ అడిషనల్ గవర్నర్ భవిరిశెట్టి రామారావు, అధ్యక్షుడు కర్నాటి నరసింహారావు, హెచ్‌ఎం రాఘవరావు, ఉపాధ్యాయులు శివశంకరరావు, శ్రీరాములు పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

అమరావతి, ఫిబ్రవరి 14 : వసంత పంచమి పర్వదినం పురస్కరించుకుని స్థానిక శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సరస్వతీ పూజ, హోమం నిర్వహించి అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.వెంకటేశ్వరరావు, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

శివరాత్రి సమీక్షకు స్పందన కరువు

అమరావతి, ఫిబ్రవరి 17 : మార్చి 8న మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో చేపట్టాల్సిన ఏర్పాట్లకు సంబంధించి బుధవారం సాయంత్రం జరిగిన సమీక్షా సమావేశం నామమాత్రంగా జరిగింది. డీఎవో ఎండీ హుస్సేన్ ఆధ్యక్షతన జరిగిన సమావేశానికి తహసీల్దార్ రమణారావు, ఈవో వేమూరి గోపితో పాటు విద్యుత్. ఆర్టీసీ, ఫైర్, పోలీసు అధికారులు మాత్రమే పాల్గొన్నారు. మిగిలిన శాఖల అధికారులు రాకపోవడంతో సమావేశాన్ని ఈవో కార్యాలయానికే పరిమితం చేశారు.

17న జిల్లా కబడ్డీ సబ్ జూనియర్స్ బాల, బాలికల ఎంపికలు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 14 : పట్టణంలోని వృందా మహిళా కళాశాలలో ఈనెల 17వ తేదీ ఉదయం 10 గంటలకు ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ సబ్ జూనియర్స్ బాల, బాలికల ఎంపికలు జరుగుతాయని జిల్లా కార్యదర్శి ఎం.సుబ్బరాజు బుధవారం విలేకరులకు తెలిపారు. ఎంపికైన జట్టు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందని, ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు సత్తెనపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని ఆయన చెప్పారు. క్రీడాకారులు బరువు 55 కేజీల లోపు ఉండాలని, మార్చి 19, 2008 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఆధార్ కార్డు, ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 9052035335 నెంబరులో సంప్రదించాలన్నారు.

ఆలయాలను నిర్మించుకోవటం గర్వించదగ్గ విషయం

బెల్లంకొండ, ఫిబ్రవరి 14 : మారుమూల గ్రామాల్లో ఆలయాలను నిర్మించుకోవటం గర్వించదగ్గ విషయమని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. చంద్రాజుపాలెంలోని శంభులింగేశ్వర స్వామి నూతన ఆలయ విగ్రహ ప్రతిష్టా మహోత్సవానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు చెన్నపరెడ్డి పద్మ వెంకటేశ్వరరెడ్డి, అభివృద్ధి కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ వెంకటరెడ్డి, నెల్లూరి వెంకటరెడ్డి, కోటేశ్వరరావు, మహమ్మద్ పాషా, సిరిపురం మేస్త్రి, పాకాలపాటి మౌలాలి, నరసింహా నాయక్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

పెదకూరపాడు, ఫిబ్రవరి 14 : ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థికి మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ల్యాప్‌టాప్‌ను అందించినట్టు ఫౌండేషన్ నిర్వాహకులు మాగులూరి కృష్ణారావు తెలిపారు. దాసరి హనీఫ్ రాజు ఇంజనీరింగ్ మూడవ సంవత్సరం విద్యనభ్యసిస్తున్నాడు. ఆ విద్యార్థికి పెదకూరపాడులో బుధవారం ల్యాప్‌టాప్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామగోపాలరావు, కుంచనపల్లి కిరణ్, ఎల్లలచెరువు సురేష్, కొండవీటి ప్రసాదు, నోముల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటను పరిశీలించిన అధికారులు

నకరికల్లు, ఫిబ్రవరి 14 : మండలంలోని చీమలమర్రి గ్రామానికి చెందిన రైతాంగం మొక్కజొన్న విత్తనాలను నాటగా గింజ సరిగా పాలు పోసుకోలేదని గుర్తించారు. దీంతో తాము బాగా నష్టపోయామని వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు, పిడుగురాళ్ళ ఏడీఏ బీ శ్రీకృష్ణదేవరాయలు, నకరికల్లు ఏవో కే.దేవదాసు బుధవారం క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. రైతుల పొలాలకు వెళ్ళి మొక్కజొన్న పైరును పరిశీలించారు. తాము పరిశీలించిన అంశాలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ బీ.జగదీష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

కట్టమూరులో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ

సత్తెనపల్లి, ఫిబ్రవరి 14 : మండలంలోని కట్టమూరులో బుధవారం రాత్రి టీడీపీ యూనిట్ ఇన్‌చార్జ్ మండడి చక్రధరరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ సాధికార సారధుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. భట్లూరు, గుజ్జర్లపూడి, గోరంట్ల, కట్టమూరు గ్రామాలకు చెందిన బూత్ ఇన్‌చార్జ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కట్టా రమేష్, ఈదర రామారావు, పుట్టా చలమయ్య, మండడి కాశి ప్రసాదు, యతీష్, నందిగామ సూరిబాబు, వేదాద్రి, కోటేశ్వరరావు, ఎం.వెంకటేశ్వర్లు, అప్పారావు, శ్రీనివాసరావు, కోటయ్య, వీరయ్య ప్రసాదు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నేతల సమావేశం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 14 : పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని అసిస్టెంట్ ఎన్నికల అధికారులు, అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులతో ఓటర్ల జాబితాపై సమావేశం నిర్వహించారు. ఆయా పార్టీల నేతల నుంచి అభ్యంతరాలను, సూచనలను స్వీకరించారు. నియోజకవర్గంలో తుది జాబితా ప్రకటన దగ్గర నుంచి నేటి వరకు చేర్చిన, తొలగించిన, సవరించిన ఓటర్ల వివరాలపై చర్చించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ షమ్మి, వివిధ మండలాల అధికారులు ఉషా, ఎం.హరిబాబు, సింగారావు, ఎస్‌కే ఎండీ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ డీఈ శ్రీనివాసరెడ్డి యువ ఉద్యోగులకు ఆదర్శం

రెంటచింతల, ఫిబ్రవరి 14 : పంచాయతీరాజ్ డీఈ పాశం శ్రీనివాసరెడ్డి నేటి యువ ఉద్యోగులకు ఎంతో ఆదర్శమని జడ్పీ వైస్ చైర్మన్ శౌంఠిరెడ్డి నర్సిరెడ్డి కొనియాడారు. గత నెల 26న రాష్ట్రస్థాయి ఉత్తమ ఉద్యోగి అవార్డునందుకున్న శ్రీనివాసరెడ్డిని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. నర్సిరెడ్డి మాట్లాడుతూ రెంటచింతల,వెల్దుర్తి మండలాల్లో వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాలను సకాలంలో పూర్తి చేయడంతో పాటు ప్రభుత్వం ద్వారా బిల్లులను తెప్పించగలిగారన్నారు. అలాగే జిల్లా స్థాయి అవార్డులను పొందిన డి.శ్రీకాంత్, జి.శివరాజ్‌ను కూడా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పూజల పుష్పవతి రామయ్య, వైసీపీ మండల కన్వీనర్ బ్రహ్మారెడ్డి, గొలమారి శ్రీనివాసరెడ్డి, జిల్లా జేసీఎస్ కన్వీనర్ మోర్తల ఉమ, సొసైటీ మాజీ చైర్మన్ మోదుగు శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్ చంద్రారెడ్డి, గురవారెడ్డి, వెంకటరెడ్డి, పమ్మి సీతయ్య, గుండా కిషోర్ ఉన్నారు.


వృక్షాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న కన్నా లక్ష్మీనారాయణ, శౌరయ్య, డాక్టర్ శాయి కృష్ణ

వృక్షాంజనేయ స్వామికి కన్నా ప్రత్యేక పూజలు

నకరికల్లు, ఫిబ్రవరి 14 : నకరికల్లు ఎన్ఎస్‌పీ కాలనీలో ఉన్న స్వయంభూ వృక్షాంజనేయ స్వామిని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ బుధవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పునఃర్నిర్మాణం చేసి రెండవ వార్షికోత్సవంలో కన్నా పాల్గొన్నారు. ఆలయ అర్చక స్వాములు ప్రత్యేక పూజలు చేసి కన్నాను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య, డాక్టర్ సింగరాజు సాయికృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు నాదెండ్ల సత్యనారాయణ, మాజీ ఎంపీపీ సాగి కోటేశ్వరరావు, షేక్ అలీ బాషా, ఆళ్ళ అమరేశ్వరరావు, చల్లా పుల్లారావు, ఆవుల వేల్పుల రాజు, తిరుమలశెట్టి వెంకటరావు, రావిళ్ళ గోపీకృష్ణ, కొనికినేని వెంకట అప్పయ్య, భవనాసి కిషోర్, ఏచూరి గణేష్, షేక్ జాన్, దరువూరు నాగేశ్వరరావు, కట్టా రమేష్ పాల్గొన్నారు. నరసరావుపేట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నకరికల్లుకు చెందిన ఢీకొండ సామ్రాజ్యం, బత్తిన కృష్ణమూర్తిలను కన్నా పరామర్శించారు. చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని కన్నా కోరారు.

అసమర్థ పాలనకు చరమగీతం పాడదాం : కొమ్మాలపాటి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

బెల్లంకొండ, ఫిబ్రవరి 14 : రాష్ట్రంలో వైసీపీ అసమర్థ పాలనకు త్వరలోనే చరమగీతం పాడదామని పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. బెల్లంకొండలో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి ఆమడ దూరంలో ఉందని, ఎమ్మెల్యేలు వైసీపీ నాయకులు సభలు, సమావేశాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందిందని చెప్పుకుంటారే తప్పా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు కొనసాగాలని తెలిపారు. అనంతరం బెల్లంకొండ మెయిన్ సెంటర్‌లో పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, నున్నా వెంకటరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఇబ్రహీం, సయ్యద్ జబ్బార్ చిట్టి, గుంజా గంగారావు, ఎన్ పిచ్చయ్య, పీఎస్‌కే రసూల్ పాల్గొన్నారు.


గ్రామమంతా సుఖ శాంతులతో కలసి మెలసి ఉండాలి

బెల్లంకొండ, ఫిబ్రవరి 14 : గ్రామమంతా పాడి పంటలతో, సుఖ శాంతులతో కలసి మెలసి జీవించాలని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో బుధవారం గంగా పార్వతి సమేత శంభు లింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, పార్లమెంట్ బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి ఓర్సు ఆనంద్, బీసీ సంఘం మండల అధ్యక్షుడు గుంజా గంగారావు, ఓర్సు రాంబాబు, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, గుడిసె కొండయ్య, లక్ష్మయ్య, శ్రీనివాసరావు, ముళ్ళీ బిక్షం, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులపై దాడి అమానుషం : కొమ్మాలపాటి

అమరావతి, ఫిబ్రవరి 14 : అధికార పార్టీ చేస్తున్న ఇసుక అక్రమ క్వారియింగ్‌ను కవర్ చేసేందుకు వెళ్లిన పాత్రికేయునిపై వైసీపీ మూకలు దాడి చేయడం అమానుషం అని పెదకూరపాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. వైద్యశాలలో చికిత్స పొందుతున్న పాత్రికేయుని పరామర్శించిన శ్రీధర్ అనంతరం విలేకరులతో మాట్లాడారు. కలెక్టర్ ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించి కొన్ని గంటలు గడవకముందే వైసీపీ నాయకులు భయంలేకుండా ఇసుక అక్రమ క్వారియింగ్ చేస్తున్నారని అన్నారు. వారి అక్రమాలను వెలుగులోకి తీసుకువస్తున్న పాత్రికేయులపై దాడి చేసిన వారిని తక్షణం అదుపులోకి తీసుకుని కఠిన శిక్షను అమలు చేయాలని శ్రీధర్ డిమాండ్ చేశారు. కలెక్టర్ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై పీడీ యాక్ట్ అమలు చేయాలని అన్నారు. పాత్రికేయునిపై దాడి చేయడంపై సీపీఎం నాయకులు బి.సూరిబాబు తీవ్రంగా ఖండించారు.

నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయులు, ఉద్యోగుల నిరసన


సత్తెనపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 14 : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏపీ జేఏసీ ఉద్యమ కార్యాచరణలో భాగంగా బుధవారం ఉపాధ్యాయులు, ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఏపీ జేఏసీ సత్తెనపల్లి శాఖ చైర్మన్ పెండెం మణిరావు మాట్లాడుతూ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలన్నారు. ప్రతి నెల 1వ తేదీన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పట్టణంలో ప్రదర్శన చేసి తహసీల్దార్ సీహెచ్ ఉషాకు తమ డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎస్.అంబేద్కర్, సందెపోగు శ్రీనివాసరావు, ఖాశిం, ప్రదీప్ కుమార్, వెస్లి, ఎస్ఎం సుభాని, అగస్టస్‌బాబు పాల్గొన్నారు.

● పిడుగురాళ్ళ, ఫిబ్రవరి 14 : ఏపీ జేఏసీ పిలుపు మేరకు బుధవారం పిడుగురాళ్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల సంఘ సభ్యులు పెండింగ్ డిమాండ్ల సాధనకై నిరసన తెలిపారు. పెండింగ్ పీఆర్సీ, డీఏ బకాయిలను విడుదల చేయాలని, పెండింగ్ జీపీఎఫ్, ఏపీ జీఎల్ఐ లోన్లు, సరెండర్ బిల్లుల విడుదలతో పాటు తక్షణమే ఐఆర్ 30 శాతాన్ని ప్రకటిస్తూ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడం, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శ్యాంసుందరరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దామెర్ల పట్టాభి, ఈవీ అప్పారావు, కేవీ చలపతిరావు, మన్నవ సాగర్‌బాబు, టి.శేషగిరిరావు, ఎం.కోటేశ్వరరావు, మహంకాళి డేవిడ్, కుటుంబరావు, మురికిపూడి ప్రసాద్, సంద్రపాటి ఓబులు, శివ, తదితర సభ్యులు పాల్గొన్నారు.

● అమరావతి, ఫిబ్రవరి 14: రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఏపీ ఎన్జీవో అసోసియేషన్ పిలుపు మేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. అనంతరం ఏపీఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షులు సూరేపల్లి రాజశేఖర్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రమణారావుకు వినతిపత్రం అందజేశారు. పెన్షనర్ల సంఘ అధ్యక్షులు జి.కోటేశ్వరరావు, ఎన్.నాగమల్లేశ్వరరావు, ఎం.మురళి, పి.సునీత, గ్రామ రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

● మాచర్ల రూరల్, ఫిబ్రవరి 14: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల పెన్షన్ సమస్యలను పరిష్కరించాలని మాచర్ల జేఏసీ నేతలు బుధవారం తహసీల్దార్ మంజునాథరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో గంగాధర్ బాబు, నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అండగా ఉంటాం : నాగరాజు

రాజుపాలెం, ఫిబ్రవరి 14 : రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణను ఆశీర్వదించాలని ఆయన తనయుడు నాగరాజు కోరారు. మండలంలోని మొక్కపాడులో బుధవారం కన్నా నాగరాజు ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామ పెద్దలు, ముఖ్యుల ఇళ్లకు వెళ్లి ఆశీర్వదించి విజయం వైపు నడిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీల మండల అధ్యక్షులు పల్లపాటి పెద్దిరాజు, తోట నరసయ్య, ఆకులగణపవరం గ్రామ పార్టీ అధ్యక్షుడు నర్రా మల్లయ్యచౌదరి, పార్లమెంటు కమిటీ కార్యదర్శి అంకాళ్ల ప్రభుదాసు, పార్టీ మాజీ అధ్యక్షులు అంచుల నరసింహారావు, గ్రామ సర్పంచ్ పద్మశ్రీను, నాయకులు సానికొమ్ము కోటిరెడ్డి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు శనగపూల వెంకయ్య, మైనార్టీ నాయకులు మాబుసుభాని, నియోజకవర్గ అధికార ప్రతినిధి షేక్ అల్లాబక్షు, కణదం వెంకట్రావు, పశ్యావుల రామారావు, సయ్యద్ చిన్నసుభాని, మాగంటి వీరాస్వామి, ఆలా నాగేశ్వరావు, పేర్నపాటి గురున్నాధం, తోట వెంకటశివ, జనసేన నాయకులు తోకల శ్రీను, నాన్నబాల రామయ్య ఉన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

అనాథ వృద్ధులకు ఆపద్బాంధవుడు



వృద్ధుడిని వృద్ధాశ్రమానికి తరలిస్తున్న కాశయ్య, యోగ మునియ్య తదితరులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 14: ఆదరించేవారు లేక, మరికొందరు అనాథ వృద్ధులు యాచకులుగా కాలం గడుపుతున్నారు. మరికొందరు యాచించడానికి కూడా శక్తిలేక దీనంగా కాలం వెళ్లదీస్తున్న వృద్ధులను కాశయ్య అనే వ్యక్తి ఆదరిస్తున్నాడు. కాశయ్య కుర్చేడు మండలం పడమర వీరయ్యపాలెంలో కరుణ వృద్ధాశ్రమంను నిర్వహిస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం నరసరావుపేట రైల్వేస్టేషన్ వద్ద వ్యక్తి బొల్లా ఉమామహేశ్వరరావు (70) అనే వృద్ధుడిని కాశయ్య చూసి స్పందించి వృద్ధాశ్రమానికి తీసుకెళ్లారు. మరికొంతమంది యాచకులకు క్రాఫ్ చేయించి స్నానం చేసి, చిన్న చిన్న గాయాలకు మందులు అందించారు. ఉమామహేశ్వరరావు నకరికల్లు మండలం తురకపాలెంకు చెందిన వ్యక్తి. భార్య, ఇద్దరు సంతానం గతించారని ఆ వృద్ధుడు చెప్పాడు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమం వ్యవస్థాపడు కాశయ్య మాట్లాడుతూ 2008 నుంచి ఈ సేవా కార్యక్రమాలు చేస్తున్నానని చెప్పాడు. ఇప్పటివరకు తన ఆశ్రమానికి వచ్చి అక్కడే తనువు చాలించిన వందమంది వృద్ధులను తానే ఖననం చేశానన్నారు. అనాథ వృద్ధులకు కాశయ్య చేస్తున్న సేవలను పలువురు ప్రశంసిస్తున్నారు.

ప్రతి ఒక్కరూ నిత్య విద్యార్థిలా మెలగాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శివ శంకర్

నరసరావుపేట, ఫిబ్రవరి 14: రానున్న సార్వత్రిక ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరూ నిత్య విద్యార్థిలా ఎప్పటికపుడు విషయాలను అవగాహన చేసుకోవాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి పేర్కొన్నారు. బుధవారం స్థానిక నరసరావుపేట మున్సిపల్ సమావేశ మందిరంలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల (నియోజకవర్గ మాస్టర్ ట్రైనర్లు) శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్ ఆదేశాలపై అవగాహన కల్పించుకోవలసిన అవసరం ఉందన్నారు. ఎన్నికల నియమావళిని క్షుణ్ణంగా ఆకళింపు చేసుకోవాలని, వచ్చిన సందేహాలను పైఅధికారులను అడిగి ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని సూచించారు. ఎన్నికల విధులలో జాగ్రత్త అవసరమని అన్నారు. ఎన్నికల కమిషన్ నూతనతంగా ప్రవేశపెట్టిన హోమ్ ఓటింగ్, పోస్టల్ ఓటింగ్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఎన్నికల ముందురోజు, ఎన్నికల రోజు, ఎన్నికల తదుపరి తీసుకోవలసిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి కే.వినాయకం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన స్కౌట్ విద్యార్థులు

నరసరావుపేట కల్చరల్, ఫిబ్రవరి 14: ఈ నెల 19 నుంచి 23 వరకు హర్యానా రాష్ట్రంలో జరిగే భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపునకు ఎంపికైన కాకాని, పురపాలక ఉన్నత బాలుర పాఠశాలల విద్యార్థులు బుధవారం పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రం తరపున జిల్లా నుంచి సెలెక్ట్ కావటంపై సంతోషం వ్యక్తంచేశారు. విద్యార్థులతో పాటు హెచ్‌ఎం రామిశెట్టి గోవిందరాజులు, సౌట్స్ అండ్ గైడ్ ఉపాధ్యాయులు టి.అంజిరెడ్డి, వేదాంతం రాంబాబులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రొంపిచర్ల, ఫిబ్రవరి 14: మండలంలోని గ్రామాల్లో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ రాంబాబు బుధవారం తెలిపారు. పిడుగురాళ్ళ పట్టణం పరిధిలోని కొండమోడు విద్యుత్ సబ్ స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా రొంపిచర్ల, రెడ్డిపాలెం, సుబ్బయ్యపాలెం, బుచ్చిపాపన్నపాలెం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్టు పేర్కొన్నారు. మూడోఫేజ్ విద్యుత్ సరఫరా తెల్లవారుజామున 12గంటల నుంచి ఉదయం 9గంటల వరకు ఇస్తామన్నారు.

అక్రమ మద్యం కేసులో నిందితురాలి అరెస్టు

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 14: అక్రమ మద్యం కేసులో మండలంలోని ఇస్సపాలెం గ్రామానికి చెందిన ఎస్ లక్ష్మి అనే మహిళను బుధవారం అరెస్టు చేసినట్టు నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార తెలిపారు. బుధవారం గ్రామంలోని ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద నిందితురాలు అక్రమంగా 15 మద్యం సీసాలను కలిగి ఉండగా దాడి చేసి అరెస్టు చేసినట్టు ఆమె తెలిపారు.

ఎస్పీని కలసిన పోలీసు అధికారులు

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 14: పల్నాడు జిల్లా ఎస్పీ వై.రవిశంకరరెడ్డిని ఇటీవల బదిలీపై వచ్చిన పలువురు పోలీసు అధికారులు మర్యాదపూర్వకంగా కలసి పూల మొక్కలను అందజేశారు. పల్నాడు జిల్లా ఏఆర్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జీ మహాత్మాగాంధీరెడ్డి, సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాజేష్‌కుమార్‌లు ఎస్పీ రవిశంకర్‌రెడ్డిని కలసిన వారిలో ఉన్నారు.

కమ్యూనిటీహాలు నిర్మాణానికి భూమిపూజ

వంకాయలపాడు (యడ్లపాడు), ఫిబ్రవరి 14: మండలంలోని వంకాయలపాడు ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కామినేని సాయిబాబు, చుండి నర్సిరెడ్డిలు బుధవారం శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణానికి అయ్యే సుమారు రూ.10లక్షలు నర్సిరెడ్డి, తాను కలసి సమకూరుస్తున్నట్లు వెల్లడించారు.

జేఈఈ మెయిన్స్‌లో వినుకొండ విద్యార్థి ప్రతిభ



మాదినేని సాయితేజ

వినుకొండ, ఫిబ్రవరి 14: జేఈఈ మెయిన్స్‌లో మండలంలోని ఏనుగుపాలెం గ్రామానికి చెందిన మాదినేని సాయితేజ 100శాతం పర్సంటైల్ సాధించి ఆల్‌ఇండియా ర్యాంక్ సాధించాడు. మొత్తం 23మంది ఈ మార్కులు సాధించగా వారిలో మాదినేని సాయితేజ ఒకరు. మాదినేని సాయితేజ తండ్రి మాదినేని ఆంజనేయులు తెలుగుదేశం పార్టీలో కీలకనాయకుడు. వినుకొండ మార్కెట్‌యార్డు చైర్మన్‌గా గతంలో పనిచేసి నేడు వినుకొండ మండల టీడీపీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. తల్లి మాదినేని వెంకటలక్ష్మి ప్రస్తుతం ఏనుగుపాలెం గ్రామ సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. మాదినేని ఆంజనేయులుకు ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు రవితేజ ఆంధ్ర యూనివర్శిటీలో ఎంబీబీఎస్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. సాయితేజ ప్రస్తుతం హైదరాబాద్‌లో నారాయణ విద్యాసంస్థల్లో విద్యనభ్యసిస్తూ జేఈఈ మెయిన్స్‌లో ర్యాంక్ సాధించాడు. సాయితేజ ర్యాంక్ సాధించడంతో తల్లిదండ్రులతో పాటు గ్రామస్థులు, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, పార్టీ నాయకులు బుధవారం ప్రత్యేక అభినందనలు తెలిపారు.



సరస్వతిదేవి పూజాకార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు

ఘనంగా గీతాంజలి పాఠశాలలో వసంతపంచమి

వినుకొండ, ఫిబ్రవరి 14: పట్టణంలోని కొత్తపేట గీతాంజలి పాఠశాలలో మాఘ శుద్ధ పంచమి (వసంత పంచమి) వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ప్రిన్సిపాల్ కృష్ణవేణి మాట్లాడుతూ వసంతపంచమి రోజున విద్యార్థినీ, విద్యార్థులు సరస్వతి అమ్మవారిని మనసారా ధ్యానించి జ్ఞానాన్ని పొందాలన్నారు. అనంతరం చిన్నారులతో సరస్వతిదేవి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సరస్వతిదేవి వేషధారణలతో చిన్నారులు విశేషంగా ఆకట్టుకున్నారు. చిన్నారులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వై.ఎల్.కిషోర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ పబ్లిక్ స్కూల్లో సామూహిక అక్షరాభ్యాసం

శావల్యాపురం, ఫిబ్రవరి 14: వసంత పంచమిని పురస్కరించుకొని శావల్యాపురంలోని శ్రీరామపబ్లిక్ స్కూల్లో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పూజారి రావిపాటి సాయిభరత్‌శర్మ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సరస్వతీదేవికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ రత్నకుమారి విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. పాఠశాల కరస్పాండెంట్ కేవీఆర్ మోహన్‌చంద్, డైరెక్టర్ అజిత్ చంద్, ఉపాధ్యాయులు మేఘన, మనీష పాల్గొన్నారు.

పేదల ఇసుక.. వైసీపీ కీలకనేత స్వాహా

● రాత్రివేళల్లో బ్లాక్ మార్కెట్‌కు తరలింపు



మార్కెట్‌యార్డులోని ఇసుక డంప్

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 14: వినుకొండ మార్కెట్ యార్డులో నిల్వ ఉన్న ఇసుకకు రక్షణ కరువైంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జగనన్న కాలనీలతో పాటు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లకు, నాడు-నేడు పనులకు ఉచితంగా ఇసుక సరఫరా చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్లు మార్కెట్ యార్డులో సుమారు 3ఎకరాల మేరకు భూమిని అద్దెకు తీసుకొని ఇసుక సరఫరా చేసేవారు. ఇటీవల కాంట్రాక్టర్లు మారడంతో 8 నెలలుగా ఇసుక సరఫరా నిలిచిపోయింది. యార్డులో భారీ స్థాయిలో నిల్వ ఉన్న ఇసుకపై వైసీపీలోని నేతల కన్ను పడింది. గుట్టుచప్పుడు కాకుండా రాత్రి వేళల్లో ఇసుకను ఓ కీలకనేత అక్రమంగా బయటకు తరలించి విక్రయిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం పేదలకు అందించాల్సిన ఇసుకను బ్లాక్ మార్కెట్‌లో అధికధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు ఆ ప్రాంతంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి యార్డులోని ఇసుక బ్లాక్ మార్కెట్‌కు తరలివెళ్లకుండా నిరుపేదలకు అందేలా చర్యలు తీసుకోవాలని ఇంటి నిర్మాణ లబ్ధిదారులు కోరుతున్నారు.

పనిచేయని సీసీ కెమేరాలు...

మార్కెట్ యార్డులోని డంప్‌ల వద్ద ఏర్పాటుచేసిన సీసీ కెమేరాలు పనిచేసిన దాఖలాలు లేవు. ఇటీవల జేసీకేసీ సంస్థ ఇసుక సరఫరా కాంట్రాక్టు తీసుకున్నట్లు సమాచారం. సంస్థకు కూడా తెలియకుండా అక్రమంగా ఇసుక తరలించడం కొసమెరుపు.

తక్షణమే మధ్యంతర భృతి ప్రకటించాలి

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి డిమాండ్



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి తహసీల్దార్‌కు వినతి ప్రతం అందజేస్తున్న ఏపీ జేఏసీ నాయకులు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 14: తక్షణమే మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ ఐక్య కార్యాచరణ సమితి (ఏపీ జేఏసీ) నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఏపీ జేఏసీ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి నరసరావుపేట తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో 15లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, ఎన్‌ఎంఆర్, డైలీ, ఫుల్ టైమ్, ఉద్యోగులు పనిచేస్తున్నారన్నారు. ప్రతి ఉద్యోగికి ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు ఉన్నాయన్నారు. 12వ పీఆర్‌సీ కమిషన్ వేసినప్పటికి నేటికీ ఏమాత్రం ప్రగతి లేదన్నారు. సంఘాలతో చర్చించి, జిల్లాల పర్యటనలు, ఉద్యోగుల నుంచి సమాచారాన్ని సేకరించి అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదికను సమర్పించేందుకు చాలా గడువు కావాల్సి ఉంటుందన్నారు. 2023 జూలై 1 నుంచి 12వ పీఆర్‌సీ అమలు కావాల్సిఉందన్నారు. తక్షణమే మధ్యంతర భృతి 30శాతం ప్రకటించాలన్నారు. ఉద్యోగుల పీఎఫ్, ఏపీ జీఎల్ఐ లోన్లు దరఖాస్తు చేసుకున్నా పెండింగ్‌లో ఉన్నాయని, సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, 11వ పీఆర్‌సీ, డీఏ బకాయిలు, ఉద్యోగుల టీఏ, డీఏ బకాయిలు సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తక్షణమే రూ.25వేల కోట్ల బకాయిలను చెల్లించాలన్నారు. ఉద్యోగ నియమాకలలో ఎన్‌ఎంఆర్, పార్ట్‌టైమ్, ఫుల్‌టైమ్, ఔట్‌సోర్సింగ్, ఎంటీఎస్, ఉద్యోగ, ఉపాధ్యాయులుగా నియామకమైన వారందరినీ క్రమబద్ధీకరించాలని, డిపార్టుమెంట్‌ల వారీగా సమస్యలు పరిష్కరించాలన్నారు.

నిరసన కార్యక్రమంలో ఏపీజేఏసీ నరసరావుపేట యూనిట్ చైర్మన్ ఎం రామకృష్ణ, కన్వీనర్ ఎం.ఆనంద్‌నాద్, సీహెచ్ కోటిరెడ్డి, ఏపీటీఎఫ్ పీ వెంకటరెడ్డి, ఎస్‌టీయూఏపీ ఏ ఏమండి, కే యేసయ్య, యూటీఎఫ్ కే వెంకటేశ్వర్లు, డీవీడీ ప్రసాదు, నారాయణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే వైసీపీ నాయకుల దాడులు

● టీడీపీ ఇన్‌చార్జ్ చదలవాడ అరవిందబాబు

రొంపిచర్ల, ఫిబ్రవరి 14: ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులపై దాడులు చేయిస్తున్నారని టీడీపీ ఇన్‌చార్జ్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. కొద్దిరోజుల క్రితం తురుమెళ్ళ గ్రామానికి చెందిన గొల్లపూడి శ్రీనివాసరావుపై పలువురు వైసీపీ నాయకులు దాడి చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావుకు బుధవారం నరసరావుపేటలోని పార్టీ కార్యాలయంలో రూ.1.20 లక్షలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా అరవిందబాబు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గ్రామాల్లో తగాదాలు పెడుతున్నారని తెలిపారు. ఓటమి భయంతోనే గతంలో వెన్నా బాల కోటిరెడ్డిని హత్య చేయించారు. ఇప్పుడు శ్రీనివాసరావుపై దాడి చేయించారని తెలిపారు. 2024 ఎన్నికల్లో గోపిరెడ్డి ఓడిపోయి ఇక్కడి నుంచి పారిపోతాడని, దాడికి దిగిన వారి పరిస్థితి ఏంటని? ప్రశ్నించారు. వైసీపీ నాయకులు పద్ధతులు మార్చుకోక పోతే భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ శ్రీనివాసరావుకు టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పులుకూరి జగ్గయ్య, పల్లెల నాగిరెడ్డి, మొండితోక రామారావు, కుమ్మెత కోటిరెడ్డి, గాడిపర్తి సురేష్, మెట్టు వెంకటేశ్వరరెడ్డి, కుంపటి రవి, పచ్చవ కోటేశ్వరరావు, మందలరపు వెంకటరత్నం, పేరుపోగు దాసు, కొలికొండ కొండలు, గాదె రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డ్రైవింగ్‌లో అవార్డు పొందిన డ్రైవర్లను అభినందిస్తున్న ఆర్టీసీ అధికారులు

ఉత్తమ డ్రైవర్లకు ఘన సన్మానం

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 14: స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో 35 సంవత్సరాలు సర్వీస్ కలిగి వై.ఎ.రాజు 2వ ప్రమాద రహిత డ్రైవర్‌గా అవార్డు పొందాడు. అదేవిధంగా వినుకొండ డిపో స్థాయిలో షేక్ ముస్తఫా మొదటి బహుమతి, గోవిందునాయక్ 2వ బహుమతి, లాల్‌సింగ్‌నాయక్ 3వ బహుమతికి ఎంపికయ్యారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ అబ్దుల్ రజాక్ ఉత్తమ డ్రైవర్లకు డిపో మేనేజర్ కోటేశ్వరరావునాయక్‌తో కలిసి సన్మానించి నగదు బహుమతులు అందజేశారు.

మాజీ సీఎం దామోదరం సంజీవయ్యకు నివాళి

వినుకొండటౌన్, ఫిబ్రవరి 14: మాజీ దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 103వ జయంతి సందర్భంగా మాల మహానాడు అన్నవరం కమిటీ ఆధ్వర్యంలో నరసరావుపేట రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పిడతల దేవదాసు, విజయ్, చందు, చరణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌ను పరిశీలించిన జేసీ

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 14: ఇటీవల వెంకుపాలెం సమీపంలోని జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఇచ్చిన పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సచివాలయంలో బుధవారం పరిశీలించారు. ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ అయిన వివరాల గురించి సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. 6083 వాటిలో 2013 పూర్తికాగా మిగిలిన పట్టాలకు కూడా త్వరలో రిజిస్ట్రేషన్‌లు చేయాలని ఆదేశించారు. ఆయనతో పాటు తహసీల్దార్ బ్రహ్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి మినీమ్యానిఫెస్టోతో పేదలకు లబ్ధి

● వినుకొండ నియోజకవర్గ జనసేన సమన్వయకర్త నాగశ్రీను



మతుకుమల్లిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాగశ్రీను

మతుకుమల్లి (శావల్యాపురం) ఫిబ్రవరి 14: టీడీపీ, జనసేనల ఆధ్వర్యంలో విడుదల చేసిన ఉమ్మడి మినీ మ్యానిఫెస్టోతో పేదప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని వినుకొండ నియోజకవర్గ జనసేన సమన్వయకర్త కొంజేటి నాగశ్రీను అన్నారు. మండలంలోని మతుకుమల్లిలో టీడీపీ, జనసేన నాయకులు ఇంటింటికీ వెళ్ళి ఉమ్మడి మినీమ్యానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరిస్తూ మంగళవారం రాత్రి కరపత్రాలు పంపిణీ చేశారు. నాగశ్రీను మాట్లాడుతూ వైసీపీ హయాంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, సంక్షేమ పథకాల పేరిట జరుగుతున్న దోపిడీతో సామాన్యుల జీవితం అస్తవ్యస్తం అవుతోందని ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ పేదప్రజలను మరింత అప్పుల ఊబిలోకి నెట్టేస్తుందన్నారు. టీడీపీ, జనసేన కలయికను ప్రజలంతా స్వాగతిస్తున్నారని, వినుకొండలో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. జనసేన మండల అధ్యక్షుడు అడపాల అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సబినీసు గోపి, టీడీపీ గ్రామపార్టీ అధ్యక్షుడు మల్నీడి శ్రీనివాసరావు, తెలుగు యువత ఆలూరి చంద్రబాబు, జనసేన గ్రామపార్టీ అధ్యక్షుడు కొండూరి చలమయ్య, నాయకులు పద్మావతి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భూ విస్తీర్ణాల్లో వ్యత్యాసాలుంటే ఫిర్యాదు చేయాలి

● తహసీల్దార్ లక్ష్మీలావణ్య

పిచికలపాలెం, ఫిబ్రవరి 14: గ్రామకంఠాలలోని ఇళ్ళు, ఖాళీస్థలాల యజమానులకు శాశ్వత భూహక్కును కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన స్వమిత్వ సర్వేలో పంచాయతీ కార్యదర్శులు అందజేసిన 9(2) పత్రాలలోని భూవిస్తీర్ణాలను యజమానులు సరిచూసుకొని వ్యత్యాసాలుంటే వెంటనే ఫిర్యాదు చేయాలని తహసీల్దార్ నక్కా లక్ష్మీలావణ్య అన్నారు. మండలంలోని పిచికలపాలెంలో స్వమిత్వ సర్వే గ్రామసభను బుధవారం నిర్వహించారు. ఇళ్ళు, ఖాళీస్థలాల యజమానుల జాబితాలను గ్రామసచివాలయంలో ప్రచురించారు. ఈవోపీఆర్డీ సుగుణ మాట్లాడుతూ పిచికలపాలెం గ్రామకంఠం, పట్టా భూములలో మొత్తం 50ఎకరాల పైచిలుకు విస్తీర్ణంలో 924మంది యజమానులు ఇళ్ళు, ఖాళీస్థలాలు కలిగి ఉన్నారని, వారికి అందజేసిన 9(2) పత్రాలలోని విస్తీర్ణాలను సరిచూసుకొని వ్యత్యాసాలుంటే రెండ్రోజుల్లో ఫిర్యాదు చేయాలని, ఆధార్‌కార్డు, ఫొటోలు ఇవ్వాల్సిన వారు వెంటనే పంచాయతీ కార్యదర్శికి ఇవ్వాలన్నారు. కనమర్లపూడి, ఇర్లపాడు గ్రామాలలో 9 (2) పత్రాల పంపిణీ తుదిదశకు చేరిందన్నారు. సర్పంచ్ తిరువీధి శివకుమారి రమణారావు, ఉపసర్పంచ్ గణపర్తి బుల్లబ్బాయి, పంచాయతీ కార్యదర్శి ముంద్రు మనోహర్, వీఆర్వో అమల, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతుభరోసా కేంద్రంలో ఎల్‌ఈడీ టీవీ చోరీ

మతుకుమల్లి (శావల్యాపురం) ఫిబ్రవరి 14: మండలంలోని మతుకుమల్లి రైతుభరోసా కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించి ఎల్‌ఈడీ టీవీని అపహరించినట్లు మండల వ్యవసాయాధికారి పల్లపోతు ప్రవీణ్ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ రోజువారీ విధులలో భాగంగా బుధవారం ఉదయాన్నే రైతుభరోసా కేంద్రానికి వెళ్ళిన వీఏఏ వరలక్ష్మి తాళాలు పగుల గొట్టి ఉండడాన్ని గమనించి లోపలికి వెళ్ళి చూడగా ఎల్‌ఈడీ టీవీ కనిపించక పోవడంతో అధికారులకు సమాచారమందించినట్లు తెలిపారు. అదే గదిలో బల్లపైనున్న డెస్క్‌టాప్‌ను తలుపు పక్కనపెట్టి వెళ్ళిపోయారు. విషయాన్ని ఎస్ఐ సురేష్ దృష్టికి తీసుకెళ్ళగా ఆయన తన సిబ్బందితో ఘటనాస్థలాన్ని సందర్శించి ఆధారాలను సేకరించారు. అపహరించిన ఎల్‌ఈడీ టీవీ విలువ సుమారు రూ.50వేల వరకు ఉంటుందని, రైతులకు ఆర్‌బీకే సేవలు, యంత్రపరికాలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం అన్ని రైతుభరోసా కేంద్రాలకు ఎల్‌ఈడీ టీవీలను అందజేసినట్లు తెలిపారు. ఈపూరు మండలం అంగలూరు రైతుభరోసా కేంద్రంలో కూడా మంగళవారం రాత్రి ఇలానే ఎల్‌ఈడీ టీవీ చోరీకి గురెనట్లు ఏవో రామారావు తెలిపారు. వీఏఏ వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చోరీ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

నేడు ఉద్యోగుల నిరసన

చిలకలూరిపేట, ఫిబ్రవరి 14: తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు బుధవారం తెలిపారు. రాష్ట్ర నాయకులు బండి శ్రీనివాసరావు, కే శివారెడ్డి హాజరవుతున్నట్లు హనుమంతనాయక్, రాఘవేంద్రరరావు, బ్రహ్మారెడ్డి, పద్మజ తెలిపారు.



కోటిరెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

గాలిగోపురం నిర్మాణానికి నిధులు మంజూరు

వినుకొండ, ఫిబ్రవరి 14: మండలంలోని మదమంచిపాడు వీరాంజనేయస్వామి దేవాలయ గాలిగోపురం నిర్మాణానికి దేవదాయ శాఖ సీజీఎఫ్ ఫండ్ కింద రూ.50లక్షలు మంజూరైనట్లు కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా రూ.50లక్షల మ్యాచింగ్ కాంట్రిబూషన్‌కు చెల్లించాల్సిన రూ.16.66లక్షలు చెల్లించిన గొల్లపాలెంకు చెందిన కోటిరెడ్డిని స్థానిక వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.

పల్నాడు నుంచి పోటీచేయడం గర్వంగా ఉంది

● అనిల్ కుమార్ యాదవ్



సభలో ప్రసంగిస్తున్న అనిల్ కుమార్‌యాదవ్

నరసరావుపేట, ఆంధ్రజ్యోతి, ఫిబ్రవరి 14: పల్నాడు నుంచి పోటీ చేయడానికి గర్వపడుతున్నాను. పల్నాడు పౌరుషాన్ని నిలబెడతానని వైసీపీ లోక్‌సభ అభ్యర్థి అనిలక్ కుమార్ యాదవ్ అన్నారు. నరసరావుపేటలో బుధవారం జరిగిన ఆత్మీయ సభలో ఆయన మాట్లాడుతూ నెల్లూరు నుంచి వస్తున్నప్పుడు కొంత బాధవేసింది. ఇక్కడ చూపిన ఆదరణతో బాధపోయి గర్వంగా ఉందని చెప్పారు. సభలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు, మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్యేలు కాసు మహేష్‌రెడ్డి, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, నంబూరు శంకరావు, చిలకలూరిపేట ఇన్‌చార్జ్ మల్లెల రాజేష్ నాయుడు, పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో ఘన స్వాగతం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 14: నరసరావుపేట వైసీపీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ అనీల్ కుమార్ యాదవ్‌కు బుధవారం ఇక్కడ చిలకలూరిపేట వైసీపీ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. వందలాది వాహనాలతో పెద్ద సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. తొలిసారిగా అనీల్ కుమార్ యాదవ్ ఇక్కడకు వచ్చిన నేపథ్యంలో బొప్పూడి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వద్ద పూజలు జరిపి ర్యాలీగా ముందుకు వెళ్ళారు.

అమరావతిపై నిజాలు చూపిస్తుంటే అంత ఉలుకెందుకు?

● మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 14: ఎట్టకేలకు రైతుల పక్షాన ఎవరో వచ్చి అమరావతిపై నిజాలు చూపిస్తుంటే వైసీపీ నాయకులకు అంత ఉలుకెందుకని? మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ప్రశ్నించారు. అమరావతి విషయంలో జగన్, వైసీపీ ఎలాంటి కుట్రలు ఏ తప్పు చేయకుంటే రైతుల త్యాగాలకు ద్రోహం చేయకుంటే రాజధాని ఫైల్స్ సినిమా ట్రైలర్స్ చూసే ఎందుకు అంత భయ పడుతున్నారన్నారు. వ్యూహం, యాత్ర వంటి సినిమాలకు లేని అభ్యంతరాలు రాజధాని ఫైల్స్ విషయంలో ఎందుకు అని ప్రత్తిపాటి ధ్వజమెత్తారు. రాజధాని ఫైల్స్ చిత్రాన్ని దర్శక నిర్మాతలు అన్ని నిబంధనలు పాటించే చిత్రాన్ని నిర్మించారని, సీబీఎఫ్‌సీ నిబంధనలు పరిమితులకు లోబడి ఎగ్జామిన్ కమిటీ పరిచయం తరువాతే అన్ని అనుమతులు పొందారని, గత ఏడాది డిసెంబరులోనే సెన్సార్ సర్టిఫికెట్ లభించిందని, అప్పుడు లేని కంగారు ఇప్పుడు ఎందుకు అన్నారు.

సంప్రదాయ వైద్యంతో ఖర్చులు తగ్గించుకోవచ్చు

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



ఆయుర్వేద వైద్యశాలకు భూమి పూజ చేస్తున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 14: సంప్రదాయ వైద్య విధానంతో ఖర్చుల భారం తగ్గించుకోవచ్చని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. బుధవారం చిలకలూరిపేట మండలం కావూరులో హోమియో ఆయుర్వేద వైద్యశాల ఎల్‌వీ ప్రసాదు కంటి పరీక్షల కేంద్రం నిర్మాణానికి ప్రత్తిపాటి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు హోమియో, ఆయుర్వేద వైద్యశాల కంటి పరీక్షల కేంద్రాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు కృషి చేయటం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు షేక్ కరిముల్లా, జవ్వాజి మదన్ మోహన్, క్లస్టర్ ఇన్‌చార్జ్ కోడె హనుమంతరావు, గట్టినేని రమేష్, కోడె మణి, బొప్పూడి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు కో-ఆపరేటివ్ సొసైటీ కార్యాలయం ప్రారంభం

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 14: ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తే సహకార బ్యాంకులు తిరుగులేని విజయాలు అందుకుంటాయని రాష్ట్రంలో నిరూపితమైనదని మాజీమంత్రి, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని కృష్ణారెడ్డి డొంకలో పల్నాడు కో-ఆపరేటివ్ సొసైటీ నూతన కార్యాలయాన్ని బుధవారం ప్రత్తిపాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు ప్రాంత ప్రజల ఆర్థిక పురోగతిలో ఈ సహకార సొసైటీ కీలక భూమిక పోషించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

మౌలిక వసతులకు సహకారం: అసిస్ట్ అసోసియేట్ డైరెక్టర్

యడ్లపాడు, ఫిబ్రవరి 14: ప్రముఖ ఎఫ్‌ఎంసీజీ సంస్థ ఐటీసీతో కలసి పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు తమ సంస్థ కృషిచేస్తున్నట్లు అసిస్ట్ సంస్థల అసోసియేట్ డైరెక్టర్ జె.కృష్ణహరీష్ తెలిపారు. బుధవారం మండలంలోని లింగారావుపాలెం, యడ్లపాడు, వంకాయలపాడు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంఈవో అరుణ, కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, డేవిడ్, వెంకయ్య, యడ్లపాడు గ్రామసర్పంచ్ హేమ, కరిమున్, పంచాయితీ కార్యదర్శి సురేష్ ఆయా పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా దేవాలయాల వార్షికోత్సవాలు

నాదెండ్ల, ఫిబ్రవరి 14: మండలంలోని చిరుమామిళ్ళలో కళ్యాణ వేంకటేశ్వర స్వామి, కాశీ విశ్వేశ్వర దేవాలయాల ఐదో వార్షికోత్సవ వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వార్షికోత్సవ వేడుకలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పూజారి శంకరశర్మ స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ వివాహాలు చేసుకొనే వారు ఎదురు నడిచేందుకు తన సొంత నిధులతో ఈ దేవాలయాన్ని నిర్మించానన్నారు. కార్యక్రమాన్ని బ్రహ్మారెడ్డి, రమణారెడ్డి, వై.శివారెడ్డి, వేమారెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆర్థికసాయం



ప్రత్తిపాటి ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ నాయకులు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 14: పట్టణంలోని స్థానిక 10వ వార్డులో టీడీపీ కార్యకర్త ఆదం షఫీ తల్లి ఆషా మృతి చెందటంపై మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు సంతాపం వ్యక్తం చేశారు. ప్రత్తిపాటి ఫౌండేషన్ ద్వారా రూ.10వేలు ఆర్థిక సాయాన్ని స్థానిక వార్డు నాయకుల ద్వారా అందజేశారు.

విద్యార్థులను దత్తత తీసుకున్న పూర్వ విద్యార్థులు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 14: స్థానిక సాధినేని చౌదరయ్య స్కూల్‌లో ఇద్దరు పేద విద్యార్థులను ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు దత్తత తీసుకున్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఆ విద్యార్థులను చదివిస్తామని తెలిపారు. 2006-07 బ్యాచ్‌కి చెందిన ఆవుల రాజీవ్, 2014 బ్యాచ్‌కి చెందిన వీరగంధం నవచైతన్య, ఈ మేరకు స్కూల్ డైరెక్టర్ ప్రభాకరరెడ్డికి బుధవారం సమాచారం అందించారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

చిలకలూరిపేట, ఫిబ్రవరి 14: నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం సంఘం నాయకులు వివిధ విద్యా సంస్థలకు వద్దకు వెళ్ళి విద్యార్థుల వద్ద నుంచి సంతకాల సేకరణ జరిపారు. నియోజకవర్గ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తలారి డ్యానీ, మేకపోతుల నాగేశ్వరరావుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

బేస్‌బాల్ పోటీలకు డీఆర్ఎన్ విద్యార్థి ఎంపిక

చిలకలూరిపేట, ఫిబ్రవరి 14: స్థానిక డీఆర్ఎన్ ఎస్‌వీఎస్ కళాశాల విద్యార్థి డీ రాజా అఖిల భారత జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బా సుజాత బుధవారం తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి అస్సాంలోని గ్లోబల్ విశ్వ విద్యాలయంలో జరిగే జాతీయ పోటీల్లో నాగార్జున విశ్వ విద్యాలయం జట్టులో ఈ విద్యార్థి పాల్గొంటాడని వివరించారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తేళ్ళ సుబ్బారావు, శివనంద కుమార్ తదితరులు విద్యార్థిని అభినందించారు.